ఆదివారం

ప్రజాశక్తి

నవంబర్ 7, 2004

కథా నిలయం
శ్రీకాకుళం

నంది

సినీ అవార్డుల సందడి

హ్యాపీ బర్త్‌డే

(7-11-2004నుండి
13-11-2004వరకు)

శ్రీచందన
2సం॥, 7.11.2002
కవిత-శ్యాంసుందర్
వారాసిగూడ-సికింద్రాబాద్

భువన్‌దీప్
1సం॥, 7.11.2003
భారతి-రవీంద్ర
లక్సెట్టిపేట-ఆదిలాబాద్

శిరీష
7సం॥, 7.11.1997
వసంత-నర్సింహయాదవ్
మేడ్చల్-రంగారెడ్డి

జె.సంపత్‌కుమార్
1సం॥, 7.11.2003
అనూరాధ-రవిప్రసాద్
వెల్దండ-మ॥నగర్

పి.లక్ష్మీ రుక్మిణి లహరి
1సం॥, 8.11.2003
రత్నకుమారి-చక్రపాణి
జమిస్తాన్‌పూర్-హైదరాబాద్

జి. భరత్‌కుమార్
5సం॥, 8.11.1999
యాదలక్ష్మి-దేవోజి
శాంతాపురం-వరంగల్

మహ్మద్ ఇర్ఫాన్ ఫయిమ్
3సం॥, 8.11.2001
షమీమ్‌బేగం-ఇస్మాయిల్
ఝురాసంఘం-మెదక్

భానుప్రకాష్
2సం॥, 9.11.2002
మల్లీశ్వరి-నిరంజన్
నాగర్‌కర్నూలు-మ॥నగర్

సాయిచందన
5సం॥, 9.11.1999
కరుణశ్రీ-శేషు
రాజీవ్‌నగర్-ఆదిలాబాద్

వి. వందన
5సం॥, 10.11.1999
రమామణి-పెద్దరాజు
ఆమదాలవలస-శ్రీకాకులం

వై.దిలీప్‌కుమార్
9సం॥, 10.11.1995
రావినూతల-ప్రకాశం

పి. జాహ్నవి
3సం॥, 10.11.2001
శివకుమారి-సురేష్‌బాబు
ముత్తుకూరు-నెల్లూరు

నవ్య
3సం॥, 10.11.2001
శోభారాణి-నాగరాజు
ఖాజీపేట-వరంగల్

లీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం



ఛానళ్ళ స్టోరీ బాగుంది

24 వతేదీ సంచికలో 'వార్తాఛానళ్ళ వెల్లువ' కవర్‌స్టోరీ చదివిన తర్వాత నేడు సమాచార రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పులు గురించి తెలిసింది. ప్రపంచంలో, దేశంలో ఎక్కడ ఏ సంఘటన జరిగినా ఇంటిలోనే కూర్చుని వివిధ ఛానళ్ళ ద్వారా వివరాలు తెలుసుకునే అవకాశాలు రావడం నిజంగా హర్షనీయం. ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రసార మవుతున్న 24గంటల వార్తాఛానళ్ళ లో బి బి సి వార్తల మాదిరిగా తెలుగులో టీవీ 9, ఈ టీవీ, తేజ వార్తా ఛానళ్ళు పనిచేస్తున్నతీరు గురించి తెలుసు కున్నాం. ఆరోగ్యం పేజీలో 'హెచ్ ఐ వి పాజిటివ్ అయితే' గూర్చి అనేక విషయాలు తెలుసుకున్నాము.

-కామిడి సతీష్‌రెడ్డి,
జడలపేట, వరంగల్ జిల్లా.

పత్రికలు, ఛానళ్ళు

వార్తాఛానళ్ళను గురించి కవర్‌స్టోరీ బాగుంది. పత్రికలకు, ఛానళ్ళకు గల తేడాను తెలియ జేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును జీవనశైలి వ్యాసంలో చక్కగా వర్ణించారు.

- షేక్ జానీబాషా, ఇంకొల్లు, ప్రకాశం.

చట్టం తనపని తాను చేసుకెళ్తోందా?!

మన దేశంలో సమన్యాయ పాలన చేయట్లేదు. పేదలకు ఒక న్యాయం, ధనికులకు ఒక న్యాయం. ఈ రోజుల్లో ఎన్ని హత్యలు, నేరాలు చేసినా డబ్బుచూపి తప్పించుకుంటున్నారు. జీవనశైలి శీర్షికలో వ్యాసం చక్కగా వివరించింది.

-కె శ్రీనివాసాచారి, దౌల్తాబాద్, మెదక్‌జిల్లా

కథ ప్రభోదాత్మకం

'కార్యాచరణకు ఆసన్నమైన కాలం' కథ ద్వారా మంచివారు ఉదాసీనంగా ఉంటే దేశం ఎంత నష్టపోతుందో తెలియజెప్పింది. గాంధీ, మేధాపట్కర్, అన్నాహజారే, మహాశ్వేతాదేవి లాంటివారు వ్యక్తులుగా ముందుకు వచ్చి శక్తిగా మారినవారే. అలాంటివారి బాటలో మనం నడిచుంటే భారతం స్వాహాతంత్రం కాకుండా స్వాతంత్రం లభించినట్లుగా ఉంటుంది. నీరజలేని నిరంజన్ తన ఆత్మప్రభోదంతో ఎలా మారి కర్మోన్ముఖుని చేసిందో చక్కగా వివరించారు. ప్రతీవారూ ఇలా ఆలోచిస్తే ఆత్మహత్యలుండవేమో!

-పెండోట వెంకటేశ్వర్, టీచర్,
మక్త లక్ష్మాపూర్, మెదక్‌జిల్లా

మనలో మాట

నాటక న్యాయ నిర్ణేతకు ఎంత కష్టమో! నవ్వొచ్చినా, ఏడుపొచ్చినా శిలావిగ్రహంలా ఉండాలంటే చచ్చేంత కష్టమే. అదే న్యాయనిర్ణేత ఓటరు అయితే ఎలక్షన్‌లో వాడు బహురూపాలతో పాటు భిన్న అభిప్రాయాలను తెలుపుతూ తను అనుకున్నదే చేసి చూపుతాడు. చెప్పుతో కొట్టినట్టు తనకు మాత్రమే తెలిసే నిర్ణయం తీసుకుంటాడు. మనలోమాట బాగుంది.

-పి రాధాకృష్ణ, బద్దిపడగ, మెదక్‌జిల్లా.

రియల్లీ రజితమే

రియల్‌స్టోరీలో రజిత జీవితం గురించి తెలుసుకుని సమాజంలో చాలామంది నేర్చుకోవాల్సి వుంది. తల్లిదండ్రులు కష్టంచూసి, వారి కష్టాల్లో పాలుపంచుకునే రజితలను మనం ఎంతో గౌరవించాలి. ఆడపిల్లయినా రజిత ట్రాక్టర్ డ్రైవింగ్ నేర్చుకుని అందరి మెప్పుపొందింది. తల్లిదండ్రులను బాధ పెట్టే మగపిశాచులు రజితలాంటివారిని చూసి నేర్చుకోవాలి. టూరిస్ట్‌గైడ్‌లో మైసూర్ అందాలు, ఛాముండీ హిల్స్, లలితమహల్ లాంటి అద్భుతసౌందర్యాలు గురించి వివరించడం బాగుంది. వారంవారం కార్టూన్ కదంబం తప్పక చూస్తాను.

-దుబ్బచర్ల భాస్కర్,
హమీదుల్లానగర్, రంగారెడ్డిజిల్లా.

రజితం

తన కన్నవాళ్ళను తన కళ్ళలో పెట్టుకుని చూసుకోవడానికి రజిత మహిళా డ్రైవర్‌గా ట్రాక్టర్‌ను నడిపింది. తన ఊరివారి, తోటివారి ప్రశంసలు అందుకోవడం నిజంగా గర్వకారణం.

-మేడూరి సత్యనారాయణ,
ఖైరతాబాద్, హైదరాబాద్.

తల్లి శిక్షణ

బాలలకథలో చక్కని నీతిని తల్లిపిల్లి తన పిల్లిపిల్లకు బోధించిన కథ 'తల్లిశిక్షణ'. మొదట పెద్దలు చెప్పినది సరిగా వినక, దానిని ఆచరిస్తే బాగుంటుందా, లేదా అని చిన్నపిల్లిపిల్ల ద్వారా చక్కగా చెప్పారు. తల్లిపిల్లి ఎంతో సహజంగా నేర్పినపాఠంలాగా వుంది.

-కార్తికేయాచారి,
6వ తరగతి, సిద్దిపేట.

మనలో మాట

టచ్‌లో వుండండి...

చెంచురామయ్య గారితో-

మనకి పని పడింది!

శ్రీవారు ప్రముఖ వాణిజ్యవేత్త. కోట్ల మీద నడుస్తుంది శ్రీవారి వ్యాపారం!

హెడ్డాఫీసు హైదరాబాదులోనే వుంది!

బ్రాంచీలంటారా? దేశమంతా విస్తరించి వున్నాయి. అంచేత ఆయన్ని పట్టుకోడం చాలా చాలా కష్టం!

ఇవాళ ఇక్కడే వుంటాడు!

రేపు ఎక్కడుంటాడో తెలీదు!

ఎక్కడున్నా దేశంలోనే వుంటాడు గదాని చీపుగా అనుకోకూడదు. బిజినెస్సు పనుల మీద శ్రీవారు ప్రపంచమంతా తిరుగుతుంటాడు!

మనకి అనకాపల్లి ఎట్లాగో శ్రీవారికి అమెరికా అంత అందుబాటులో వుంటుంది. మనం అనకాపల్లి కేంప్ పెట్టుకున్నట్టు - శ్రీవారు అమెరికా తరచూ వెడుతుంటారు!

అంతెందుకు?

ఆయనకు చిరాగ్గా వుంటే ఛలో స్విట్జర్లాండ్ అంటారు. ఇంటో అలిగితే ఇటలీ వెళ్ళిపోతారు. వాతావరణం అన్ని విధాలా ప్రశాంతంగా వుంటే మాత్రం పారిస్‌కి పారిపోతాడు!

అల్లాంటి మనిషి మనకెట్లా అందుబాటులో వుంటాడు?

ఆయన్తో అయిదు నిమిషాలు మాటాడే అదృష్టం అంత సులువుగా దొరకదు. ఏడాది ముందుగా అర్జీ పెట్టుకోవాలి. లక్కు బాగుంటే అది ఆయన సెక్రటరీ చేతుల్లో పడుతుంది. ఖర్మకాలిపోతే చెత్తబుట్టలో దాక్కుంటుంది!

అల్లాంటి చెంచురామయ్యగారికి మన చెన్నకేశవులు చిన్ననాటి మిత్రుడు. మన చెన్నకేశవులు కలగజేసుకుంటే - శ్రీ చెంచురామయ్యని మన జేబులో పెట్టుకోవచ్చు! అప్పుడు మన అప్పడాల అమ్మకానికి దిగులుండదు!

కానీ చెన్నకేశవులు అదో టైపు మనిషి!

ఏం చెప్పినా ఓసింతే గదా అంటాడు. మరిచిపోతానేమో టచ్‌లో వుండమంటాడు. టచ్‌లో వుండమన్నాడంటే మనకి మూడిందన్నమాటే! అతని చేతిలో అప్పడమల్లే చితికిపోతాం!

చూద్దాం చేద్దామనే జాబితాలోనే - టచ్‌లో వుండమన్న వార్నింగ్ కూడా చేరిపోతుంది.

ఇంతకీ చెప్పొచ్చేదేమంటే... సోనియాగాంధీ ఫొటో మీ ఇంటో తగిలించినంత మాత్రాన తెలంగాణా సంగతేమిటో మేడమ్‌ని అడిగి చూడండని మిమ్మల్నడిగితే ఏం ప్రయోజనం? ❖

ఈ సంచికలో . . .

ఓరా! . . .	3
కార్టూన్ కదంబం... . . .	4
కవర్ స్టోరీ . . .	5
జీవనశైలి . . .	10
బాలల కథ . . .	11
బాలనేస్తాలు . . .	12
రియల్ స్టోరీ . . .	14
ఇంతిసంగతులు . . .	16
పుస్తక పరిచయం . . .	20
కళాసాహితి . . .	22
న్యాయసలహాలు . . .	24

ఇంకా...



లీజు బస్సు-అద్దె బతుకు

కథ ... 8, 9



"బోల్‌గార్డు-భళిభళీ బి.టి."

కచేరి ... 17

పిప్పిపన్ను వ్యాధిని గుర్తించడం ఎలా?

ఆరోగ్యం . . . 18, 19

మైసూర్ ప్యాలెస్‌లో ఎన్నెన్ని అందాలో...

టూరిస్ట్‌గైడ్ . . . 21

ఇట్లు... దరిద్ర దామోదరం

చౌర్యానికీ ఉందో నాగరికతా విశేషం! ఇదుగో ఉదాహరణ అన్నట్లు భువనేశ్వర్‌లో ఏడు దుకాణాల్లో జరిగిన దొంగతనం కేసు చెబుతోంది. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన ఈ దొంగగారు రాజధాని భువనేశ్వర్‌లో తను కన్నంవేసిన క్యాష్‌కౌంటర్ల వద్ద తన స్వలిఖిత లేఖలను పెట్టి మరీ ఉడాయించాడు. తన పరిస్థితి బాగోకే ఈ దొంగతనం చేశానని, చెడుగా అనుకోవద్దని, దయచేసి పోలీసులకు తెలుపవలదని సవినయంగా రాశాడు.



పర్మెనెంటు అయ్యేదెప్పుడో...!?!

ఎవరన్నా మొట్టమొదటిసారి ఆ లైబ్రరీకి వెళ్ళితే అక్కడుండే వ్యక్తిని చూసి, "ఏవిటీ అండర్‌వేర్ ఎడ్వర్‌టైజ్‌మెంటు షో" అనుకుంటారు. ముంబయిలోని ఆ లైబ్రరీలో గత పన్నెండేళ్ళుగా ఇదే సీను. అచల్‌సింగ్ అనే 43ఏళ్ళ ఆ లైబ్రేరియన్ తన ఉద్యోగం పర్మెనెంటు చేయాలని ఈ విధాన నిరసనాందోళన చేస్తున్నాట్ట! తన ఉద్యోగం పర్మెనెంటు చేసేదాక ఇలా కేవలం కట్‌డ్రాయరుతోనే ఉండి డ్యూటీ చేస్తానని భీష్మించుకున్నాడు. ప్రపంచీకరణ మంత్రదండం ఇచ్చిన ఆదేశానుసారం ప్రభుత్వవ్యయం తగ్గించే ఖాతాలో ఈ గ్రంథాలయాలున్నాయని, ఆ విధాన తన ఈ టెంపరవరీ కొలువయినా ఉంటుందో ఊడుతుందో పాపం ఈ అమాయక చక్రవర్తికి తెలియదు. తన ఉద్యోగం ఊపిరాగేంతదాకా ఈ చెడ్డీడ్రస్సేనని ఆ గ్రంథభాండాగారోద్యోగికి తెలియదు.

పడిపోతేనేం... సినిమాల్లో పడింది!

సుజాత అనే అమ్మణి పోలీసునవుదామని చెన్నయ్ నుంచి ముంబయికొచ్చింది. రిక్రూట్‌మెంట్ బోర్డువారు పెట్టిన ఫిట్‌నెస్ టెస్టింగ్ రౌండ్‌లో కళ్ళుతిరిగి పడిపోయింది. పడిపోయిన ఆ అమ్మాయి ఫొటో పేపరోళ్ళు ఓ వార్తతో పాటు వేశారు. సినీదర్శకుడు చరణ్ ఆ ఫొటో చూసి సుజాతకు తన సినిమాలో నటిగా తీసుకుంటాను రమ్మని కబురంపాడు. ఆ కబురు నమ్మలేనంతయి మళ్ళీ కళ్ళు తిరిగిపడిపోయుంటుంది. అలాంటి ఆఫర్ మరి! పోనీలేండి...జనాన్ని చెదరగొట్టే లాఠీ అవుదామనుకుంది. కానీ జనం గుంపులుగుంపులుగా ఎగబడే సినిమాలకు నటి అయ్యిందిలెమ్మని కూసంత సంతోషిద్దాం.

కార్టూన్ కదంబం

ఠంగ్
జై శ్రీరాం...
జెడి(యు)
దేశం


సిఎం
వినతిపత్రం ముట్టినట్టు అకనాలెడ్జ్‌మెంట్ అడుగుతోంది సార్!
దున్నపోతుకు వినతిపత్రం ఇచ్చిన కల్లుగీత కార్మికులు


మూగ, చెవిటి వార్తల కోసం ప్రాక్టీస్ కాదు, సైగలు చేసి చెబుతున్నాడు
ఇక ఎక్కువగా మాట్లాడను: బాబు
నారు

నంది

సినీ అవార్డుల సందడి



"ఈ నంది అవార్డుల కమిటీలో సినిమా రూపకర్తలకు స్థానం దక్కలేదు. అందులో అర్హులెవరూ లేరు. అవార్డులకు చిత్రాలను ఎంపికచేసే స్థాయి జ్యూరీ సభ్యులకు లేదు. వి.ఎస్.ఆర్.స్వామి అనే సభ్యుడు కేవలం రెండు మూడు చిత్రాలను మాత్రమే చూశారు. ఆయన అవార్డుల ఎంపికకు ఏ విధంగా అర్హుడు? జాతీయ స్థాయిలో అయితే ఇలాంటి వారిని అనర్హులుగా ప్రకటిస్తారు. హింసను ప్రోత్సహించేలా ఉన్నవాటికి ఉత్తమ చిత్రాల కేటగిరిలో అవార్డులివ్వగూడదని నిబంధన ఉంది. కాని 'ఒక్కడు' చిత్రాన్ని ద్వితీయ ఉత్తమ చిత్రంగా ఎంపిక చేయడం నిబంధనల్ని ఉల్లంఘించడమే. వాశిరాజు ప్రకాశం అనే సభ్యుడు 'హీరో' చిత్రానికి పి.ఆర్.ఓ.గా వ్యవహరించారు. జ్యూరీ సభ్యులకు, ఎంట్రీలుగా వచ్చిన చిత్రాలకు ఎలాంటి సంబంధం ఉండకూడదు. కానీ 'హీరో' చిత్రానికి అవార్డు వచ్చింది. ఈ అవకతవకలపై ఎవరైనా కోర్టుకెళ్ళవచ్చు. అసలు మన నంది అవార్డులకు విలువలేదు". ఇవి సుప్రసిద్ధ నవ్య దర్శకుడు బి.నరసింగరావు ఇటీవలి నంది అవార్డులపై చేసిన ఘాటైన విమర్శ.

హెచ్.రమేష్‌బాబు

"తెలుగు సినిమాల్లో సాంకేతికపరమైన అభివృద్ధి స్పష్టంగా కనిపించింది. కాని కథాపరంగా, నటనాపరంగా చెప్పుకోడానికి ఏమీ లేదు. హృదయాన్ని స్పందింపజేసే కథలే లేవు". ఇది 2003 నంది అవార్డు కమిటీ జ్యూరీ ఛైర్మన్ గుమ్మడి ఉవాచ.

ఈ రెండు వ్యాఖ్యలు స్థూలంగా నేటి తెలుగు సినిమా స్థితిని, నంది అవార్డుల ఎంపిక తీరు తెన్నులను, వాటి పతన దిశనూ చూపుతున్నది. తాము కోట్లాది రూపాయలు నీళ్ళలా పారబోసి గొప్ప గొప్ప చిత్రాలు తీస్తున్నామని ప్రెస్‌మీట్లలో గొంతులు చించుకునే దర్శక నిర్మాతలకు ఈ వ్యాఖ్యలు మింగుడుపడకపోవచ్చు కాని అందరూ అంగీకరించవలసిన వాస్తవాలు.

భారతీయ సినీ రంగానికి ప్రోత్సాహాన్ని అందించేందుకు నెహ్రూ కాలంలో 1955లో జాతీయ సినిమా అవార్డులను ప్రవేశపెట్టారు. తొలి అవార్డుల పోటీలో బి.ఎన్.రెడ్డి తీసిన 'బంగారుపాప', సత్యజిత్‌రే 'పథేర్ పాంచాలి'తో పోటీ పడింది. చివరి వరకూ అవార్డు వస్తుందనుకున్నారు. కానీ మన బంగారు పాప రెండవ స్థానానికి వచ్చి 'రే' చిత్రం మొదటిస్థానంలో అవార్డుకు అర్హమైంది. అలా ఆనాడు చేజారిన జాతీయ స్వర్ణపతకం నేటికీ తెలుగు సినిమాకు దక్కలేదు సరికదా ఆ చేరువలోకి కూడా వెళ్ళలేకపోయింది. ఇంకా చెప్పాలంటే ఆ తర్వాతి కాలంలో ఒక్కోసారి ఇండియన్ పనోరమాకు ప్రాంతీయ చిత్రంగానైనా ఎంపిక కాని దుస్థితి మన తెలుగు సినిమాది.

ఈ నేపథ్యంలో 1965లో కాసుబ్రహ్మానందరెడ్డి మద్రాసులో ఉన్న తెలుగు సినిమా ఆంధ్రప్రదేశ్‌కు తరలిరావడానికి, ఉత్తమ చిత్రాల నిర్మాణానికి ఊతమిస్తూ 1964 నుండి నంది అవార్డులను ప్రారంభించారు. తొలుత ఉత్తమ, ద్వితీయ స్థాయిలో స్వర్ణ, రజత, కాంస్య నందుల మూడు అవార్డులతో ప్రారంభించారు.

1964లో మొదలైన ఈ నంది అవార్డుల పరంపరలో కాల క్రమేణా వీటి విలువ పడిపోవ నారంభించింది. 80వ దశకం చివరి దాకా ఈ అవార్డుల పట్ల కొంత విశ్వసనీయత ఉండేది. కానీ ఓ పదిహేనేళ్ళుగా ఈ అవార్డుల ఎంపిక అంతా ఒక ప్రహసనంగా మారుతున్నదనే విమర్శలు వస్తున్నాయి. ఈ జ్యూరీలో సభ్యుల ఎంపికే అస్తవ్యస్తంగా ఉంటున్నదనే విమర్శలున్నాయి. ఈ స్థితిలో ఉత్తమ చిత్రాలకు అవార్డులెలా వస్తాయో, అవి ఏ తీరున ఉంటాయో చెప్పనక్కర్లేదు. దీంతో నంది అవార్డు అనేది ఏదో ఒక విధంగా ప్రభావితం చేసి తెచ్చుకునే 'బొమ్మ' అనే స్థాయికి పడిపోయింది. మరోవైపు ఎలాంటి ప్రభావాలకు తలొంచక న్యాయనిర్ణయం చేయాల్సిన కమిటీ సభ్యులు... ఒత్తిళ్ళకో, మరోవిధమైన రాజకీయాలకో తలొగ్గి చెత్త సినిమాలకు 'సంతోషం'గా నంది అవార్డులు ఇస్తున్నారనే విమర్శలు



బంగారు నంది
ఉత్తమ చిత్రం
'మిస్సమ్మ'

ఖాయమైపోతున్నాయి. మరొకరకంగా చెప్పాలంటే ఈ నంది అవార్డులను ఇవ్వగణాలంతా కలసి పంచుకుంటున్నారనిపిస్తుంది.

ఈ నంది అవార్డులపై, వాటి ఎంపికపై జ్యూరీ సభ్యులపై విమర్శలు రావడం ఇది కొత్తకాదు. సరిగ్గా పదేళ్ళనాడు 1993లో వచ్చిన నంది అవార్డులపై కూడా ఇలాంటి విమర్శలే వచ్చాయి. అప్పటికి సారా నిషేధంపై రాష్ట్రమంతటా ఉద్యమాలు జరగడం, కోట్ల విజయ భాస్కరరెడ్డి సారా నిషేధాన్ని ప్రకటించడం జరిగింది. ఈ నేపథ్యంలో అభ్యుదయ దర్శక నిర్మాత అయిన ఆర్.నారాయణమూర్తి అక్షరజ్యోతి, సారా నిషేధం కథాంశంగా తీసిన 'దండోరా' చిత్రానికి ఉత్తమ సంభాషణా రచయిత (పి.ఎల్.నారాయణ), స్పెషల్ జ్యూరీ అవార్డుతో సరిపెట్టారు. ఈ చిత్ర దర్శక నిర్మాత జ్యూరీపై తీవ్ర స్థాయిలో దండెత్తి "సారా నిషేధ పోరాటాన్ని, మహిళల ఉద్యమ కృషిని ఇతివృత్తంగా సినిమా తీస్తే, ఆ చిత్రాన్ని ప్రభుత్వం గుర్తించే తీరు ఇదేనా? ఛైర్మన్‌గారన్నట్లు పరిశీలనకు వచ్చిన చిత్రాలు చెత్తగా లేవు. చెత్తగా ఉన్నది అవార్డుల ఎంపిక మాత్రమే. అందుకే ఈ చెత్త అవార్డును తిరస్కరిస్తున్నాను" అని విమర్శించారు. 1993 నాటి అవార్డులపై నాటి జ్యూరీ ఛైర్మన్ జస్టిస్ గంగాధర్ చేసిన 'చెత్త చిత్రాలనే' వ్యాఖ్యపై దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ కూడా తీవ్రంగానే స్పందించారు.

1998 సంవత్సరానికి గాను ప్రకటించుకున్న నంది అవార్డుల విషయంలో కూడా వివాదం తలెత్తింది. కారణం 'స్వర్ణక్క' సినిమాలో నటించిన 'రోజా'కు ఉత్తమ నటి రావడం. విమర్శకు కారణమేమిటంటే స్వర్ణక్క సినీదర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ కాగా, జ్యూరీ ఛైర్మన్ తమ్మారెడ్డి కృష్ణమూర్తి కావడం. ఇదే సంవత్సరం జ్యూరీలో సభ్యులుగా ఎంపికైన వి.బి.రాజేంద్ర ప్రసాద్ తన కుమారుడు జగపతిబాబు నటించిన 'అంతఃపురం' చిత్రం ఎంట్రీగా రావడం వల్ల జ్యూరీలోంచి తప్పుకుని తన నైతిక ధర్మాన్ని పాటించారు. ఇదే విషయం తమ్మారెడ్డి కృష్ణమూర్తి పాటించలేదు. ఇలా కమిటీ సభ్యులే ఉన్నత విలువలను పాటించనప్పుడు నంది అవార్డులకు విలువలెలా పెరుగుతాయో సినీ పండితులే ఆలోచించాలి. జ్యూరీ ముందుకు వచ్చిన ఎంట్రీ చిత్రాలకు, జ్యూరీ సభ్యులకు ఎలాంటి సంబంధం ఉన్నా వారిని కమిటీ నుంచి తొలగించే అధికారం ఎ.పి.ఎఫ్.డి.సి. ఛైర్మన్‌కు గాని, సమాచార కమిషనర్‌కు గాని ఉండటం ఎంతైనా అవసరం. ఇంకా చెప్పాలంటే ఒకసారి జ్యూరీ ఛైర్మన్‌గానో, సభ్యుడు గానో ఎంపికైన వ్యక్తిని ఎట్టి పరిస్థితుల్లోనూ తరువాతి సంవత్సరాల్లో మళ్ళీ నియమించకూడదు.

మరోవైపు ఈ సంవత్సరం అవార్డుల జ్యూరీ ఛైర్మన్ గుమ్మడి వెంకటేశ్వరరావు 'తెరమీద మితిమీరిన హింస తాండవిస్తోంది. కడవల కొద్ది రక్తాన్ని గుమ్మరిస్తున్నారు. వేట కొడవళ్ళు, గొడ్డళ్ళు, సుమో ఛేజ్‌లు ఎక్కువైపోయాయి. ఇవి అవాంఛనీయమైనవ'ని స్వయంగా చెప్పారు. అయితే వారు ఛైర్మన్‌గా వున్న జ్యూరీనే ఫక్తు హింసాత్మక చిత్రం 'ఒక్కడు'కు ఎనిమిది నందులు, 'నిజం' హీరోకి ఉత్తమ నటుడు అవార్డు ఇచ్చారు. పైగా 'ఒక్కడు' ద్వితీయ ఉత్తమ చిత్రం కూడాను. ఇలాగే గత ఏడాది (2002) ఉత్తమ నటులుగా చిరంజీవి, నాగార్జునలను ఎంపిక చేయడం కూడా విమర్శలు రేపింది. అంతెందుకు 2001 నంది అవార్డుల్లోనూ ఫ్యాక్షన్ చిత్రం 'నరసింహనాయుడు'లో గొడ్డళ్ళతో వెంటాడి విలన్లను చంపిన హీరో బాలకృష్ణకు ఉత్తమ నటుడి అవార్డు ఇవ్వడం పలు రకాల విమర్శలకు దారితీసింది. హింసను ప్రోత్సహించేలా ఉన్న చిత్రాలను ఉత్తమ చిత్రాల కేటగిరిలో చేర్చరాదనే నిబంధనను తుంగలో

ఈ కవర్‌స్టోరీ సందర్భంగా ఆర్. నారాయణమూర్తితో 'ప్రజాశక్తి' చేసిన ఇంటర్వ్యూ

ప్ర. నంది అవార్డులు- జ్యూరీ ధోరణులు పై మీ అభిప్రాయం ?

నంది అవార్డులంటే నాకు చిన్నప్పటినుంచి చాలా గౌరవం ఉండేది. సినిమా రంగం కళారంగంలో గొప్పది కాబట్టి... అసలు నంది అవార్డు అంటే... సామాజికపరమైన చైతన్యపరమైన చిత్రాలకు, ఈస్తటిక్ వాల్యూస్ చిత్రాలకూ, నటీనటులకూ, సాంకేతిక నిపుణులకూ, ప్రజ్ఞా పాటవాలను ప్రదర్శిస్తున్న చిత్రాలకు ఈయడం ఆనవాయితీ..

నా చిన్నప్పుడు... సుడిగుండాలు, కాలంమారింది. మా భూమి, ఒక ఊరి కథ, మేఘసందేశం, ముత్యాల ముగ్గు... వీటికి నంది అవార్డులు వచ్చాయని వింటుంటే న్యాయ నిర్ణేతలు అబ్బ ఎంత గొప్పచిత్రాలకు ఇచ్చారురా అని ఆనందించేవాడిని. ఆ చిత్రాలు చూసి చాలా విషయాలు తెలుసుకునేవాడ్ని. సినిమా ఇలా తియ్యాలిరా అనుకునేవాడిని. అయితే గత 5,6 ఏళ్ళనాటినుంచి నంది అవార్డుల వాల్యూస్ పోయాయి. లాబీస్, ప్రభావాలు వచ్చాయి. న్యాయనిర్ణేతల అభిరుచులు ప్రతిబింబిస్తున్నాయి... అది సరైందికాదని నా అభిప్రాయం.

నంది అవార్డులు అనేవి ప్రయివేటు సంస్థలివికావు. బాధ్యతతో కూడిన ప్రభుత్వానివి. అందుకే న్యాయంగా ప్రకటించాలి... పీపుల్స్ మనీతో ప్రభుత్వం నిర్వహిస్తున్న సెటప్. ప్రజల పక్షంగా ఉండాలి. పక్షపాతరహితంగా ఉండాలి. ధర్మంగా, న్యాయంగా ఉండాలి. న్యాయం జరక్కపోతే అనేకరంగాల్లో ఫేలయినట్లే సినిమారంగం కూడా ఫేలవ్వాల్సి వస్తుంది..

నా చిత్రాలు ప్రజలు మెచ్చుకున్నారా లేదా. అదే నాకు భారత రత్నతో సమానం. ప్రజల రివార్డే అవార్డు.

ప్ర. 1993లో సాగిన బలమైన సారా వ్యతిరేక ప్రజాఉద్యమం ప్రతిబింబంగా 'దండోరా' తీశారు. ఆ ఏడాది నంది అవార్డులపై మీ స్పందన ?

జగిత్యాలలాంటి తెలంగాణాప్రాంత ఉద్యమాలలోంచి ఈ సారావ్యతిరేక ఉద్యమం రేగింది.. ఆ తర్వాత... నెల్లూరు జిల్లాలో దూబగుంట స్త్రీలపోరాటం నిజంగా చరిత్రే.. ఉప్పుసత్యాగ్రహంనాటి లాగా ప్రజలు కదిలి వెళ్ళారు. కమ్యూనిస్టులు, అభ్యుదయవాదులు అందరూ నడుం బిగించి స్త్రీలకు సహకరించారు. ఈ ఉద్యమం కథాంశంగా 'దండోరా' సినిమా తీశాను. అందులో స్త్రీలే నాయకులు(హీరోలు). దాన్ని ప్రజలు ఆదరించారు. అటువంటి సినిమాకు అవార్డు రాలేదు. చాలాచోట్ల 'దండోరా' సినిమా చూసిన ప్రజలు సారా కొట్లు బద్దలు కొట్టారు. అదే నాకు ఆనందం. అవార్డుల కమిటీ కన్సోలేషన్ బహుమతి ప్రకటించింది. దాన్ని తిరస్కరిస్తూ నా అభిప్రాయాన్ని చెప్పుకున్నా... పైగా అపుడు రీమేక్ చిత్రానికి అవార్డు ఇచ్చారు. న్యాయంగా రీమేక్‌కు ఇవ్వకూడదనే రూలుంది. ఇదెక్కడి న్యాయమండీ.... ఏ అవార్డు ఆశించి స్త్రీలు ఉద్యమాలు చేశారు? కళాకారుడిగా నా పాత్ర నేను పోషించాను. సినిమా తీశాను. ఆనాడు కొంతమంది మహిళలు స్పందించారు. మా పేగులు లెక్కపెట్టావు బిడ్డా.. కడుపుకోత, ఆకలి బాధను చూపించావే బిడ్డా.. అని దీవించారు. దానికంటే పెద్ద అవార్డు ఏమిటి? ఆ సినిమాలో జయరాజ్ కొండల్లో కోయల పాట పాడాలి...పల్లెల్లో అక్షరదీపం వెలగాలి అనే పాట రాశాడు. ప్రభుత్వ కార్యక్రమాల్లో కూడా ఆ పాట వినియోగించుకున్నారు కానీ దానికీ అవార్డు ఇవ్వలేదు.

సినిమాల నాణ్యత పెరగలేదు : డి.వి.ఎస్.రాజు

ఇప్పుడు ఇండస్ట్రీలో నిర్మాత అనేవాడే లేడు. డబ్బున్న వాడెవడైనా నిర్మాత అయ్యాడు. సినిమాలంటే కేవలం వ్యాపారం లాంటిదే అనే ఉద్దేశంతో అభిరుచి లేకుండా సినిమాలు తీస్తున్నారు. ఇక మంచి చిత్రాలెలా వస్తాయి. నంది అవార్డులు పెరిగాయి. కానీ సినిమాల నాణ్యత పెరగలేదు. 99 శాతం హింసాత్మక చిత్రాలే వస్తున్నాయి. రొటీన్ ఫార్ములానే అంతా పాటిస్తున్నారు. 2003 నంది అవార్డులన్నీ అర్హులకే వచ్చాయి. ఒకటి రెండు విమర్శలు వస్తుంటాయి. కనుక ఒకసారి జ్యూరీలో సభ్యులైతే మళ్ళీ మూడేళ్ళ తర్వాత వారికి అందులో మళ్ళీ స్థానం కల్పించాలి. ఈ నంది అవార్డుల విషయంలో గుమ్మడి గారిని అనుమానించలేం. కొత్త తరం వారిలో ఎవరికి వారు తామే నందికి అర్హులమనే వారుండటం వల్ల కూడా కొన్ని విమర్శలు వస్తుంటాయి.



నంది అవార్డులకు నలభైయేళ్ళు

1964 నుండి "డాక్టర్ చక్రవర్తి"తో మొదలైన ఈ నంది అవార్డు "కీలుబొమ్మలు", "గుడిగంటలు"లాంటి చిత్రాలు అవార్డు అందుకున్నాయి. ఉత్తమ చిత్రాలకు గాను ఆయా సినీ నిర్మాతలకు పదివేలు, దర్శకునికి నాలుగు వేలు, మూడువేలు, ఒకవేయి, ఒకవేయి. అయిదు వందలు నగదును అందజేసేవారు. ఈ పద్ధతి 1977 దాకా కొనసాగింది.

అప్పటిదాకా ఉత్తమ చిత్రాల నాయికా, నాయకులకు జ్ఞాపికలిచ్చే పద్ధతిని మార్చి ఉత్తమ నటుడు, ఉత్తమ నటి అవార్డులు, ఉత్తమ బాలనటుడు, కెమెరామెన్, ఉత్తమ గాయని, గాయకులకు, సంగీత దర్శకుడికి, గేయ రచయితకు అవార్డులివ్వడం ఆరంభించారు. 1976లోనే 'బెస్ట్ స్క్రీన్‌ప్లే'కు అవార్డు పెట్టారు. 1978లో బాలల చిత్రానికి అవార్డునిచ్చారు.

1981లో ఈ అవార్డుల్లో మరిన్ని విభాగాలు వచ్చి చేరాయి. ఉత్తమ సహాయ నటీనటులు, ఉత్తమ కథకుడు, కళాదర్శకుడు, కొత్త దర్శకుడు, సౌండ్ ఇంజనీర్, ఎడిటర్, ప్రత్యేక జ్యూరీ అవార్డులు, ఉత్తమ దర్శకుడికి నగదుతో పాటు కాంస్య నందులను అందజేస్తారు. అనంతరం ఉత్తమ కమెడియన్, విలన్, నృత్య దర్శకుడు అవార్డులను 1985లో, 1995లో ఉత్తమ సినీ విమర్శకుడు, ఉత్తమ సినీ గ్రంథం అవార్డులు చోటు చేసుకున్నాయి. చివరికి మేకప్‌మెన్, కాస్ట్యూమ్ డబ్బింగ్ ఆర్టిస్ట్‌లకూ నంది అవార్డులు వచ్చాయి. ఈ అవార్డుల్లోనే కె.వి.రెడ్డి ఉత్తమ దర్శకుడి అవార్డు, గుమ్మడి ఉత్తమ కారెక్టర్ ఆర్టిస్ట్ అవార్డు, అక్కినేని సకుటుంబ సమేతంగా చూసే చిత్రం అవార్డు, జాతీయ సమైక్యత సరోజినీదేవి అవార్డు వంటివి మొత్తం 40కి పైగా నంది అవార్డులు ఏటా విజేతలకు బహూకరిస్తారు. గత జులై 31న మరణించిన అల్లు రామలింగయ్య పేరున కూడా ఏర్పాటైన ఓ అవార్డు వచ్చే ఏడాది (2004) నుండి నంది అవార్డుల్లో చోటు చేసుకుంటుంది.

ఈ అవార్డులను కూడా ఈ ఏటి చిత్రాలకు మరుసటి ఏడు ఉగాది నాడు ఇవ్వాలనేది సంప్రదాయం. కాని అలా జరిగిన సందర్భాలు తక్కువ. 1968, 69 సంవత్సరాల అవార్డులను డిసెంబర్ 71లో, 1970, 71, 72 అవార్డులను సెప్టెంబర్ 74లో, 1978, 79, 80 అవార్డులను సెప్టెంబర్ 1981లో, 1994-95 అవార్డులను 1996లో, 2000, 01 అవార్డులను 2002లో అందజేశారు. ఇలా రెండు మూడేళ్ళ అవార్డులను కలిపి ఒకేసారి ప్రకటించి ప్రదానం చేయడం వల్ల వాటి ప్రాధాన్యత తగ్గుతుంది. ఏయేటికాయేడు సకాలంలో ప్రకటించి విజేతలకు బహూకరిస్తే నంది అవార్డుల విలువ మరింతగా ఇనుమడిస్తుంది.

తొక్కి, జ్యూరీ వారు తమ వ్యక్తిగత అభిప్రాయాలకు విలువనిచ్చి ఎంపిక చేస్తున్నారని సినీరంగంలోనే పలువురు అభిప్రాయపడుతున్నారు.

చాలా సందర్భాల్లో రాష్ట్రస్థాయి అవార్డులు నోచుకోని తెలుగు చిత్రాలు జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డులందుకుంటున్నాయి. గతంలో బి.నరసింగరావు తీసిన 'రంగులకల', 'దాసి', 'మట్టి మనుషులు', జాతీయ, అంతర్జాతీయ అవార్డులందుకున్నాయి గానీ తెలుగువారి నందులకు నోచుకోలేదు. ఆ మధ్య ఉమామహేశ్వరరావు తీసిన 'అంకురం'ను కూడా నంది కమిటీ పట్టించుకోలేదు. కానీ జాతీయ అవార్డుకు ఎంపికైంది. జాతీయ స్థాయిలో పలు అవార్డులందుకున్న 'భగవద్గీత'క్కూడా ఒక్క నందీ రాలేరు. అంతెందుకు మొన్నటి జాతీయ అవార్డుల్లో స్థానం పొందిన 'ఐతే' చిత్రానికి కూడా నంది అవార్డుల్లో అన్యాయమే జరిగింది. జాతీయ స్థాయిలో మెప్పించిన చిత్రం రాష్ట్ర స్థాయిలో మెప్పించ లేకపోవడం ఎలా జరుగుతుందో నంది జ్యూరీ మెంబర్లకే తెలియాలి.

తెరనిండా రక్తపాతం, ద్వంద్వార్థాల సంభాషణలు, బట్టపీలికల్తో శరీరాన్ని కప్పుకునే నాయికలున్న సినిమాలే ఎంట్రీగా వస్తున్నాయని, నటనలో భాగమైన వాచికం లేకపోయినా ఉత్తమ నటీనటుల అవార్డులిచ్చే జ్యూరీకి జాతీయ సమగ్రతా చిత్రం, డాక్యుమెంటరీ, ఉత్తమ సినీ గ్రంథం విభాగాల్లో ఉత్తమమైన వాటిని ఎందుకు ఎంపిక చేయలేదో మరి. ఉదాహరణకు ఉత్తమ సినీ గ్రంథం విభాగంలో 1995 నుండి ఇప్పటిదాకా ఎంపిక చేసిన తొమ్మిది పుస్తకాల్లో కేవలం రెండు మాత్రమే ప్రామాణికమైనవి. మిగతా ఏడు పుస్తకాలు తప్పుల తడకలుగా ఉన్నాయని పత్రికలే రివ్యూలు రాశాయి. అంతెందుకు 2002 సంవత్సరంలో ఉత్తమ సినీ గ్రంథంగా ఎంపికైన 'తెలుగు సినిమా వైతాళికులు'ను వి.ఎ.కె.రంగారావు ఆ గ్రంథాన్ని, రచయితనే కాదు ఎంపిక చేసిన జ్యూరీని సైతం తీవ్రంగా విమర్శిస్తూ రాశారు. కానీ ఈ ఏడాది ఎంట్రీలుగా వచ్చిన మూడు సినీ గ్రంథాల్లో ఒక్కటి కూడా ఉత్తమమైనది లేదనడం హాస్యాస్పదమే. ఈ విషయంలో కొంత ప్రొఫెషనల్ జెలసీ (వృత్తిపరమైన ఈర్ష్య) పనిచేసిన విషయం బహిరంగ రహస్యమే. అలాగే 'ఉత్తమ సినీ విమర్శకుడు' ఎంపిక కూడా సరిగ్గా లేదనే అభిప్రాయాలు వచ్చాయి.

వీటన్నింటికీ కారణం సెన్సార్, టెలిఫోన్ అడ్వైజరీ బోర్డు నియామకాల్లాగే జ్యూరీ మెంబర్ల నియామకంలో కూడా సభ్యుల అర్హత కంటే రాజకీయాల ప్రభావమే పైచేయి అవుతున్నది. మన జ్యూరీ సభ్యులు మానస సరోవరంలోని హంసల్లా ఉండాలని కాకపోయినా కనీసం సృజనాత్మకతను గుర్తించే వారైనా అయితే చాలనేది విజ్ఞుల అభిప్రాయం.

రఘుపతి వెంకయ్య అవార్డు

కేంద్ర ప్రభుత్వంలాగే సినీ అవార్డులతో బాటు తెలుగు సినిమా పరిశ్రమకు విశేషమైన సేవలు చేసిన సీనియర్ సినిమా ప్రముఖునికి 1980 నుండి 'రఘుపతి వెంకయ్య అవార్డు' అందజేస్తున్నారు. రు.50 వేల నగదు గల ఈ అవార్డును ఇప్పటివరకు ఎల్.వి.ప్రసాద్, పి.పుల్లయ్య, కొసరాజు, బి.నాగిరెడ్డి, డి.వి.ఎస్.రాజు, అక్కినేని, బాపు-రమణ, భానుమతి, అంజలి, దుక్కిపాటి, గుమ్మడి, కాంతారావు వంటి 23 మందికి బహూకరించారు. 2003 సంవత్సరపు వెంకయ్య అవార్డును వి.బి.రాజేంద్ర ప్రసాద్‌కు ప్రకటించారు.



నాటి నంది అవార్డు ఆణిముత్యం 'డాక్టర్ చక్రవర్తి'

నంది అవార్డుల తీరు తెన్నులు ఇలా ఉండగా తెలుగు సినిమాలు కూడా తిరోగమన దిశలో సాగుతున్నది. కథ లేకుండా హీరోల కాల్షీట్లు దొరికితే చాలు షూటింగ్ చేసేస్తున్నాయి. ఈనాటి హీరోయిన్ల కన్నా నాటి వ్యాంప్ పాత్రలే నయం అనే స్థాయికి నేటి సినిమాల్లో స్త్రీ పాత్రలను దిగజార్చారు. నంది అవార్డులు వచ్చింది 1964లో. కానీ అప్పటికి తెలుగు టాకీ వయసు 33 సంవత్సరాలు. 33 ఏళ్ళకాలంలోనే ఉత్తమ కళాఖండాలనదగిన మల్లీశ్వరి, పాతాళభైరవి, స్వర్ణసీమ, సుమంగళి, పెద్ద మనుషులు, మాయాబజార్, మిస్సమ్మ, గుండమ్మకథ, తోడికోడళ్ళు, దొంగరాముడు, వెలుగు నీడలు, ఇల్లరికం, లవకుశ, పునర్జన్మ, ఆరాధన, చివరకు మిగిలేది, నమ్మిన బంటు, ఎం.ఎల్.ఏ. వంటి ఉత్తమ చిత్రాలు వచ్చాయి. అంటే ఏ అవార్డులు లేనినాడే ఉత్తమ సినిమాలు రూపొందాయనే విషయం తేటతెల్లమవుతుంది. కానీ నంది అవార్డుల్ని ప్రవేశపెట్టాక క్రమంగా తెలుగు సినిమాల్లో ప్రమాణాలు కొరవడి జాతీయస్థాయిలో గుర్తింపుకు దూరమవుతున్నాయి. దీంతో నంది అవార్డులు - తెలుగు సినిమాలు దొందూ దొందే అన్నచందంగా మారింది. ఉన్న చెత్తల్లో "ఉత్తమ చెత్త", "ఉత్తమ ద్వితీయ చెత్త" అనుకోవాల్సి వస్తోంది. ఇంకా నయం 'మిస్సమ్మ' సినిమాను ఉత్తమంలో ఉంచి, 'ఒక్కడి' హింసను ద్వితీయం అని ఇంకాస్త సిగ్గుందని చెప్పుకున్నారు!

సినిమా రంగంలో ప్రతిభావంతుల నైపుణ్యాన్ని గుర్తించి ప్రోత్సహించడం ఈ అవార్డుల ప్రధాన లక్ష్యం. కానీ కాలక్రమేణా నంది అవార్డు వన్నె తరిగిపోతున్నది. ఈ అవార్డులివ్వడమనేది ఓ మొక్కుబడి కార్యక్రమమైంది. అసలు ఈ నంది అవార్డులపై సినిమా పరిశ్రమలోని వారికే విశ్వసనీయత లేకుండా పోతోంది. ❖



లీజు బస్సు... ...అద్దె బతుకు

పాయల మురళీకృష్ణ

సాయంత్రం అయిదున్నర. చిన్న తుంపర్లతో వర్షం కురుస్తోంది. బస్సు స్టేషన్‌కి ఆ బస్సు కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్న ముఖ్యమంత్రిలా దూసుకువచ్చింది. అప్పటివరకు చినుకుల నుంచి తప్పించుకోడానికి మూల మూల దాక్కున్న జనమంతా బెల్లం మీద వాలిన ఈగల్లా బస్సును చుట్టుముట్టారు. ఆ ఊరికి బస్సు ఎన్ని ట్రిప్పులు తిరిగినా జనం మాత్రం విపరీతంగా ఉంటారు. జనం విపరీతంగా ఉన్నా... స్వంత బస్సుల్తీసేసి... అద్దె బస్సుల్నే నడుపుతారు సర్కారువారు.

జనం... విపరీతమైన జనం... ఒకరినొకరు తోసుకుంటూ జనం... పడేసుకుంటూ తొక్కుకుంటూ ఎక్కుతున్నారు. అక్కడ ఆడా, మగా తేడా ఇసుమంతైనా కనిపించలేదు. కాలేజీ కుర్రాళ్ళు మాత్రం చివర్న ఎక్కుదామని నిలబడి చూస్తున్నారు.

"నాకో సీటుంచు" అన్నాడో వ్యాపారి. అప్పటికే లోపల కూర్చున్న మరో వ్యాపారితో.

"ఈ బస్సు ఏ ఊరెల్తాది బాబు" చదువురాని ఓ వ్యక్తి లోపల కూర్చున్న వ్యక్తి నడిగాడు.

"ఫలానా ఊరు" బదులిచ్చాడు లోపలి వ్యక్తి.

కండక్టరు, డ్రైవరు టీ తాగి బస్సు దగ్గరకు వచ్చారు. కండక్టరు జేబులోంచి సిగరెట్ తీస్తూ "ఎక్కండి, ఎక్కండి!" అంటూ గద్దించాడు. డ్రైవర్ అటువైపుగా వెళ్ళి డోర్ తీసి తన సీట్లో కూర్చున్నాడు. జనమింకా ఎక్కుతూనే ఉన్నారు. కండక్టర్ అరుస్తూనే ఉన్నాడు. సిగరెట్ తాగడం అయిపోయాక కండక్టర్ బస్సెక్కి చివరికెళ్ళాడు. టిక్కెట్లు పంచింగ్ పట్టుకొని.

కాలేజీ స్టూడెంట్‌లు డోర్‌కేలబడుతూ ఉన్నారు... డోరెయ్యండి అరుపు డ్రైవర్‌నించి... డోర్ పడలేదు. డ్రైవర్ మళ్ళీ అరిచాడు. అప్పటికి మెల్లగా డోర్ వేసాడో కాలేజీ స్టూడెంట్...

డ్రైవర్ బస్సు స్టార్ట్ చేశాడు. బస్సు మెల్లగా కదిలింది. చిన్న తుంపర్లు ఇంకా పడుతూనే ఉన్నాయి.

"బాబూ ఈ సీటునాది. ముందుగా నేను ఆఫర్ చేసుకొన్నాను నా రుమాలు వేసి... లే... లే..." అన్నాడో నిలబడి ఉన్న వ్యక్తి.

"నేనూ రుమాలు వేసాను అందుకే కూర్చున్నాను..." అంటూ కూర్చున్న వ్యక్తి సమాధానమిచ్చాడు.

వాళ్ళిద్దరికీ కాసేపు వాదన జరిగి ఒకే సీట్లో సర్దుకొని కూర్చున్నారు. బస్సు వెళ్తూనే ఉంది.

"ఎక్స్క్యూజ్‌మి... మీదేవూరు..." పక్కనున్న వాడ్ని అడిగాడో తాగుబోతు... అప్పటికే బాగా తాగిన నిషాతో..

"ఫలానాఊరు" బదులిచ్చాడు పక్క వ్యక్తి..

"సత్యం తెలుసా" అన్నాడు తాగుబోతు.

"ఏ సత్యం" అడిగాడు పక్క వ్యక్తి.

"సత్యమే" అన్నాడు ఏ సత్యమో చెప్పకుండానే తాగుబోతు.

"తెలీదు" అన్నాడవతల వ్యక్తి.

"ఆ వూరేనట... సత్యం తెలీదట"

గట్టిగా అన్నాడు తాగుబోతు. పక్క వ్యక్తి నిశ్శబ్దంగా కూర్చున్నాడు... తాగుబోతుతో నాకేంటి అని.

సత్యం కోసం చాలా సార్లు అడిగి అడిగి తాగుబోతు కూడా ఊరుకున్నాడు. ఇక బదులురాదని నిర్ధారించుకొని.

"మాష్టారూ మీ అమ్మాయి ఎమ్‌సెట్ ర్యాంకెంత వచ్చింది!?" అడిగాడో మాష్టారు మరో మాష్టారిని.

"రెండు వేల అయిదొందలు"... మొదటి మాష్టారి ప్రశ్నకి జవాబు .

"సీటొస్తుందా!?" మళ్ళీ ప్రశ్న.

"మెడిసిన్ రాదు. అందుకే చైతన్యలో లాంగ్‌టర్మ్ పెట్టాను..." అన్నాడు రెండో మాష్టారు.

వెనుకసీట్లో కూర్చున్న వ్యక్తి, పక్క వ్యక్తితో "అసలు ర్యాంకు అయిదు వేల రెండొందలైతే... ఆ మాష్టారు చూశావా ఎలా చెప్పాడో... అంతే!?.. అంటూ గొణిగాడు.

"మంచిపని చేశారు.. డాక్టరు కోర్సు చదివించండి... ఇంటర్‌లో ఎమ్.పి.సి. తీసుంటే దెబ్బైపోదురు. ఇంజనీర్లు కుప్పలకొద్దీ తయారైపోతున్నారు.." అన్నాడు మొదటి మాష్టారు.. విద్యా వ్యవస్థపై సమగ్రమైన అవగాహనున్నట్లు. రెండో మాష్టారు ముఖంలో తన కూతురు డాక్టరైపోయినంత సంబరం కనిపించింది.

"డ్రైవర్ చూడే ఎంత అందంగా ఉన్నాడో... అదేదో సినిమాలో 'అబ్బాస్' లాగ..." అందో కాలేజీ అమ్మాయి మరో కాలేజీ అమ్మాయితో...

"అవునే ఆ టీవి... బస్సుతోలే ఆ స్టైయిల్ అచ్చం హీరోలాగ" అంది రెండో అమ్మాయి...

అప్పటి నుండి వాళ్ల మాటలన్నీ డ్రైవర్ మీదే...

ఆ కుర్ర డ్రైవర్ కూడా అమ్మాయిలున్నారనేమో గాని బస్సును వేగంగా రకరకాల విన్యాసాలతో తోలుతున్నాడు.

"ఎలా ఉంది వ్యాపారం?" అడిగాడో... చిన్న వ్యాపారి. పెద్ద వ్యాపారిని.

"సెల్లర్ మిల్లు పెట్టినా చిల్లిగవ్వ లాభం రావడం లేదు.." అన్నాడా పెద్ద వ్యాపారి.

"ఓస్... మిల్లీ డబ్బుంతా వచ్చేసిందట.. అందరూ అనుకుంటున్నారు..."

"ఎవడన్నాడయ్యా మా బాధలు మావి..... ఏం మనుషులయ్యా ఏమీ లేనివాటిని ఎంతెంత చేసి అల్లుతారు... పాడులోకం" అంటూ నిట్టూర్చాడు... నోరు మాత్రం నిజాన్ని దాచినట్లు తడబడింది.

టింగ్... టింగ్.... బస్సాగింది...

స్టేజీ కాని ప్రదేశంలో ఆపడంపై అందరూ డ్రైవర్ వైపు సందేహంగా చూశారు. "కండక్టరు టిక్కెట్లు ఇంకా కొట్టలేదు. అందుకే ఆపాడు..." అన్నాడు రోజూ తిరిగే ఓ ఉద్యోగి..

"అమ్మా! దాహమేత్తందే.." అంటూ ఓ పిల్లాడు వాళ్ళమ్మ నడిగాడు... "ఇక్కడ నీళ్ళెలా వస్తాయిరా! ఊనేకో లేకపోతే రెండు తగుల్తాయి" అంది వాళ్ళమ్మ.

ఇది విన్న ఓ ఉద్యోగి తన బాటిల్లో కాసిన్ని నీళ్ళుంటే ఆ అబ్బాయికిచ్చాడు....

ఆ అబ్బాయి గటగటా తాగేశాడు...

ఆ తల్లి ఉద్యోగివైపు కృతజ్ఞతా పూర్వకంగా చూసింది...

"ఏయ్ కండక్టరూ... ఆ కాలేజీ గుంటల్తో మాట్లాడుకుంటూ ధీమాగా టిక్కెట్లు కొడితే ఎలాగయ్యా... ఇక్కడ చిన్న పిల్లల్తో ఆడోళ్ళున్నారు. గాలి రావడం లేదు. వేగంగా టిక్కెట్టు కొట్టు" అంటూ గట్టిగా అరిచాడు... తాగుబోతు...

ఆ మాటలు పట్టించుకోలేదు కండక్టర్.

"మేం కొత్త పి.ఆర్.సి.కి అందుతామంటారా!" అన్నాడో కొత్త ఉద్యోగి... ఓ సీనియర్ ఉద్యోగితో...

"మన పి.ఆర్.సి., తెలంగాణా రెండో ఎస్.ఆర్.సి. ఇప్పుడప్పుడే జరగవని అభిజ్ఞ వర్గాల భోగట్టా"... అన్నాడా సీనియర్ ఉద్యోగి పేపర్ భాషలో.

"ఏయ్ కండక్టరూ... నా రిక్వెష్టుకి రెస్పెక్టెక్కడిచ్చావు.." గయ్ మన్నాడు తాగుబోతు.

కండక్టరు కాలేజీ కుర్రాళ్ళని టిక్కెట్ అడిగాడు... పాస్ చూపించారు వాళ్ళు...

టింగ్... టింగ్.. బస్సు స్టార్టయింది.

ఈసారి బస్సు జోరందుకుంది... చల్లగా గాలి వీస్తోంది. అప్పటికే భూమిని చుట్టిన చీకటి కాంతుల్లో బస్సు చాలా వేగంగా సాగిపోతోంది...

బస్సు తారు రోడ్డు మీంచి మట్టి రోడ్డుకి చేరింది. గతుకుల వల్ల బస్సు మెల్లగా వెళ్ళవలసి వచ్చింది.

"ఎన్ని ప్రభుత్వాలొచ్చినా... ఈ రోడ్లింతే..." అంటూ వ్యాఖ్యానించాడు తాగుబోతు.

డోర్ దగ్గరున్న ఇద్దరు కాలేజీ స్టూడెంట్లు ముందున్న అమ్మాయిని చూస్తూ... "ఒరేయ్ ఆ అమ్మాయిని లైన్లో పడేయడమెలాగో అర్థం కావడం లేదు. చాలా సిన్సియర్ లాగుంది..." అన్నాడు మొదటివాడు. రెండోవాడు వెంటనే కండక్టరును చూపించాడు. వాడు కండక్టరుని ఎందుకు చూపించాడో మొదటి వాడికి మాత్రం అర్థం కాలేదు. ఇంతలో బస్సాగింది. అందరిలో మళ్ళా సందేహం. డ్రైవర్ కిందకి దిగాడు. బస్సు కిందికి దూరి టార్చిలైట్‌తో పరీక్షించి బయటకు వచ్చాడు.

"బస్సు ఇంజన్ చెడిపోయింది. ఇప్పుడిక కదల్దు... మెకానిక్ రావాలి... ఉందామనుకున్న వాళ్ళు ఉండండి. వెళ్ళిపోదామనుకున్న వాళ్ళు వెళ్ళిపోండి" అన్నాడు.

తాగుబోతు "నా డబ్బులు నాకిచ్చేయ్" అన్నాడు కండక్టరుతో.

"అదెలాగౌద్ది" అన్నాడు కండక్టరు.

తాగుబోతు అయినా అల్లరి చేశాడు.

కండక్టరు, డ్రైవరు కలిసి నాలుగు తగిలించారు.

నోటికొచ్చిన తిట్లు తిట్టుకొంటూ ఆ తాగుబోతు చీకట్లో కలిసిపోయాడు.

అటువైపుగా ఓ మోటార్ బైక్ వచ్చింది.... అందమైన ఓ అమ్మాయిని మాత్రం ఎక్కించుకొని వెళ్ళిపోయింది. కాలేజీస్టూడెంట్లు ఆ బైక్ వైపే చూస్తూ బాధపడ్డారు వాళ్ళకు బైక్ లేదని...

సెల్లర్ మిల్లు వ్యాపారి... అటుగా వచ్చిన ఆటో బేరమాడుకొని సామాన్లతో ఎక్కేశాడు.

డబ్బున్నవాడు ఎలాగైనా వెళ్తాడు అనుకున్నారు జనం. అందరూ నడుచుకుంటూ వెళ్ళిపోయారు.

డ్రైవర్, కండక్టరూ కూడా డిపోకి ఫోను చెయ్యడానికి ఆ వూరే వెళ్ళారు..

బస్సు...!

ఖాళీ బస్సు...!!

లీజుకి తెచ్చుకున్న చెడిపోయిన బస్సు...!!?

ఆ లీజు బస్సు నొదిలేసి నడిచెళ్ళిపోతున్న లీజు బతుకు జీవులు!?

వందకోట్లమందిని కని ఎవరి దారి వాళ్ళే చూసుకోవాలని అభివృద్ధి చెందుతూ ఉన్నాననే ప్రగతి పత్రం ముఖాన తగిలించుకొని... ఎప్పుడూ ప్రగతికి ఆమడ దూరంలోనే ఉండి... నిశ్శబ్దంగా నిస్తేజంగా... ఓ మంచి సంఘ సంస్కర్త కోసం ఎదురు చూసే భారతమాత వలే... ఖాళీ బస్సొక్కటే రోడ్డు మీద.

ఓ మంచి "మెకానిక్" కోసం ఎదురు చూస్తూ...

'కోలా' హాలం

డాక్టర్ ముదిగంటి సుజాతారెడ్డి

మామయ్య ఊరి నుంచి వచ్చాడు. మామయ్య వస్తే ఊర్లోని విశేషాలు అడిగి తెలుసుకోవాలని ఉంటుంది నాకు. ''మామయ్యా! ఈ సంవత్సరం వర్షాలు తక్కువ కద. పొలాలు ఎట్లా వున్నాయి?" అడిగాన్నేను.

"ఏదోనమ్మా! వర్షాలు లేవు నిజమే కాని అప్పుడప్పుడు జల్లులుగా వర్షాలు కురవటంతో మెట్టచేలు బాగానే వున్నాయి. కాని అన్నిటికన్నా బాధలు విత్తనాలతో వస్తున్నాయి" మామయ్య ముఖంలో బాధ కన్పించింది.

"విత్తనాలతో ఏం బాధలు మామయ్యా! ఇప్పుడు హైబ్రిడ్ విత్తనాలు బాగా దిగుబడి వస్తున్నాయంటున్నారు కద!" అడిగాన్నేను.

"విత్తనాలు మంచిగా మొలిస్తే పూత, కాయ వస్తే దిగుబడి బాగానే వస్తుంది. కాని కొన్ని విత్తనాలు వేస్తే మొలవటమే లేదు. మొదటికే మోసంగా వుంది వ్యవహారం. ఏమైతే అదవుతుందని రైతులు బోలెడు ధరలు పోసి మళ్ళా విత్తనాలు తెచ్చి వేస్తున్నారు. కాని అవి పూతకు, కాయకు రాకముందే పురుగు తగులుతూ వుంది. ముఖ్యంగా పత్తికి ఒకటే పురుగు, రోగాలు" మామయ్య గొంతు నిరాశగా వుంది.

"రైతులు మరేం చేస్తున్నారు మామయ్యా!" అడిగాన్నేను.

"ఈ మధ్య ఊర్లల్లో పెప్సీకోలాలకు, థమ్సఅప్‌లకు బాగా గిరాకీ పెరిగిందమ్మా సుశ్మీ!" చిరునవ్వు నవ్వాడు మామయ్య.

అదేమిటి చేలకు పురుగు పడితే ఏం చేస్తున్నారు రైతులంటె ఊర్లల్లో పెప్సీ కోలాలకు, థమ్సఅప్‌లకు గిరాకీ పెరిగిందని మామయ్య ఖుష్ అవుతు న్నాడేమిటి? - నాకంతా అయోమయమనిపించింది.

"ఎందుకు మామయ్యా కోలాకు గిరాకీ! మొన్ననే ఎవరో చెప్తున్నారు. మన దేశంలో కోలాకు గిరాకీ పడిపోయింది. కొబ్బరిబోండాల ముందు కోలా నిలవలేకపోయింది. ఓడిపోయింది. ఇక మన దేశానికి కూల్‌డ్రింకుల్లో "హాలాహలం" ప్రమాదం లేదు - అని సర్వేలో ఋజువయ్యిందన్నారే!" అన్నాన్నేను ఆశ్చర్యపోతూ.

''అవునేవెూ! ఎక్కడ చూసినా కుప్పలుకుప్పలుగా కొబ్బరిబోండాలు దర్శనమిస్తున్నాయి. కొబ్బరిబోండాలకు సీజన్ అనేది లేకుండాపోయింది. అన్ని కాలాల్లో అన్ని ఋతువుల్లో కొబ్బరిబోండాలను తాగుతున్నారు జనం. పట్నంలో కూడా చూసాన్నేను. రోడ్ల మీద గల్లీల్లో అంతటా అమ్ముతున్నారు. కాని ధర బాగానే వుంది. పిరమైనా కొబ్బరిబోండా ధర కోలాసీసా కన్నా కాస్త తక్కువే వుంటుందిలే! అందుకే జనం ఆ కోలా తాగే కన్నా కొబ్బరిబోండాలు తాగితే ఆరోగ్యానికి మంచిది కద అని అనుకుంటున్నారు. ఫ్రిజ్‌ల్లో పెట్టుకొని మరీ కూల్‌డ్రింకుల్లాగా తాగుతున్నారు. అవును అమ్మాయి! కొబ్బరి నీళ్ళు ఫ్రూటీలాగా కాగితం ప్యాకెట్ల లాగా కూడా వస్తున్నాయట గద! ఇక వాటి ముందు కోలా ఏం నిలబెడ్తుంది చెప్పు!" మామయ్య ఆగకుండా ఉపన్యాసంలా దంచేస్తుంటె నేను ఆశ్చర్యపోయి అవాక్కయిపోయి నోరు తెరిచి నిలబడిపోయాను.

"ఏమైందమ్మాయి! మాట్లాడవేంటి..." అడిగాడు మామయ్య.

"అది కాదు మామయ్యా! కోలాకు ఊర్లల్లో ఎందుకు గిరాకీ పెరిగిందని నేనడుగుతుంటె నువ్వేమిటి కొబ్బరి బోండాల గురించి లెక్చరు దంచేస్తున్నావు. ఇంతకూ కోలాకు ఎందుకు గిరాకీ పెరిగింది మామయ్యా!"

"అదా! థమ్సఅప్, కోలాలు కొని రైతులు చేలకు పురుగుమందుగా కొట్టేస్తున్నారు. పురుగుమందులకు చావని పురుగులు వాటితో చస్తున్నాయి. పురుగు మందులకు - అదేనమ్మ పెస్టిసైడ్లకు బోలెడు ధరలు. తక్కువలోనే దొరికే థమ్స అప్, కోలాలకు పురుగులు చస్తున్నాయి కదా అని రైతులు ఆ సీసాలు కొని చేలకు చల్లుతున్నారు. అందుకే వాటికి గిరాకీ పెరిగింది. అన్నాను" మళ్ళా చిరునవ్వు నవ్వాడు మామయ్య.

"అదేమిటి మామయ్య! కోలా, థమ్స అప్‌లకు పురుగులెట్లా చస్తాయి. ఇంపాజిబుల్!" అన్నాన్నేను.

''ఆc... పెద్ద పెద్ద శాస్త్రజ్ఞులు అదేమాటన్నారు. కోలాతో పురుగులు చావటవేమిటి అనీ... కాని నిజానికి చల్లితే పురుగులు చస్తున్నాయి!" అన్నాడు మామయ్య బల్ల గుద్దినట్లుగా.

''ఏవెూ! మామయ్యా! ఇదంతా నమ్మలేకుండా వుంది. అయితే కోలాలో ఏం గుణముందంటావు చేల మీది పురుగులు చావటానికి" కుతూహలంగా అడిగాన్నేను.

"కోలాలో ఏ గుణం లేదమ్మాయి! నిపుణులు లాబరేటరీలో పరీక్షలు చేసి చివరకు తేల్చిందేమంటే వాటిల్లో నలభైశాతం పెస్టిసైడ్స్ వున్నాయని! దాంతోనే పురుగులు చస్తున్నాయి!" మామయ్య చిరునవ్వుతో నావైపు చూశాడు.

"హాc... అయితే కోలా, థమ్సఅప్ తాగేవాళ్ళంతా ఆ పెస్టిసైడ్‌ను తాగుతున్నారన్నమాట! మరి వాళ్ళ ఆరోగ్యాలు ఏం కావాలి!" అన్నాన్నేను భయపడిపోతూ.

"ఏం లేదమ్మాయి! ఇక మీద ఆ కోలాలు, థమ్సఅప్‌లు తాగకూడదని అనుకోవాలి అంతే!" పెద్దగా నవ్వాడు మామయ్య.

"అంటే కోలాలు థమ్సఅప్‌లు చేలల్లో పురుగులు చంపటానికి పనికి వస్తాయన్నమాట! గుడ్! అందుకేనన్నమాట ప్రపంచీకరణా సామ్రాజ్యవాదం తెల్ల బోయి చూస్తున్నది" అంటూ చిరునవ్వు నవ్వాన్నేను.



భరిణ రహస్యం

మేకల మదన్‌మోహన్‌రావు

ఆహ్-లింగ్ అనే వృద్ధురాలికి నలుగురు కొడుకులు. ఆమె తన యావదాస్తిని వారికి పంచి ఇచ్చింది. ఇకపై ఒక్కొక్కరి దగ్గర సంవత్సరానికి మూడు నెలల చొప్పున వుంటానని, తన బాగోగులన్నీ వారే చూసుకోవాలని చెప్పింది.

ఈ ఏర్పాటు కొంతకాలం వరకు బాగానే పని చేసింది. కాలం గడుస్తున్న కొద్దీ తన కొడుకులు తనను సరిగా చూడటంలేదని ఆమెకు అనిపించసాగింది. తనను హృదయ పూర్వకంగా పిలవడంలేదని, గౌరవించడంలేదని అనుకొంది. డబ్బే ప్రధానమని భావించే వారి స్వభావాలు ఇప్పుడు ఆమెకు పూర్తిగా అర్థమయ్యాయి.

ఒకనాడు ఆహ్-లింగ్‌ను చూడటానికి ఆమె స్నేహితురాలు జింగ్-మెయ్ వచ్చింది. కొడుకుల నిరాదరణకు గురైన ఆమె దుస్థితికి బాధపడింది. వారికి బుద్ధి చెప్పడానికి ఆహ్-లింగ్‌కి ఒక ఉపాయం చెప్పింది. దాన్ని పాటించమని చెప్పి స్నేహితురాలి వద్ద సెలవు తీసుకొని వెళ్లిపోయింది.

కొద్దిరోజుల తర్వాత ఒక రోజు ఆహ్-లింగ్ చీకటిపడే సమయంలో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లింది. ఒక గంట తర్వాత తిరిగి వచ్చింది. ఆమె బట్టల నిండా బురద నిండి వుంది.

"ఇంతసేపు ఎక్కడికెళ్లావమ్మా?" అని ప్రశ్నిస్తున్న ఆమె కొడుకు తల్లి చేతిలోని భరిణను చూశాడు.

"ఏంటది?" ఆత్రంగా ప్రశ్నించాడు.

"మనందరి జీవితాలను వేరు వేరు విధాలుగా అభివృద్ధి చేసే ఒక వస్తువు" అంది తల్లి.

"అందులో ఏముంది?"

"అది నేను చనిపోయాక మాత్రమే నీకు తెలుస్తుంది" అని చెప్పింది.

క్షణం ఆలస్యం చెయ్యకుండా అతను ఈ సంగతిని మిగతా అన్నదమ్ములకు చేరవేశాడు.

"అంటే... ఆమె తన ఆస్తి మొత్తాన్ని మనకు పంచి ఇవ్వలేదన్నమాట. కొన్ని విలువైన వజ్రాలను తన దగ్గర అట్టే పెట్టుకుందన్న మాట. ఆ ముసల్ది ఇలాంటి భరిణలను ఇంకెన్ని దాచిపెట్టిందో..." అన్నాడు పెద్దకొడుకు.

అందరూ కలిసి తల్లిని ఎన్నో ప్రశ్నలు వేశారు. కానీ ఆమె భరిణకు సంబంధించిన వివరాలేవీ చెప్పలేదు. దాన్ని తెరచి, అందులో ఏముందో చూడాలని విశ్వప్రయత్నం చేశారు నలుగురు కొడుకులు. అయితే దానికి వేసిన తాళం చాలా దృఢంగా వుంది. దాని తాళం చెవి వారి దగ్గరలేదు.

కానీ ఇప్పుడు ఆహ్-లింగ్‌ను ఎవరూ నిర్లక్ష్యం చేయటంలేదు. కొడుకులు, కోడళ్లు ఆమె మీద ఎక్కడలేని ప్రేమను, గౌరవాన్ని కురిపించసాగారు. పోటీపడి మరీ ఆమెను తమ ఇంటికి ఆహ్వానించసాగారు. పైగా మూడు నెలల గడువు ముగిసినా ఆమెను మరికొంత కాలం తమ దగ్గరే వుండమని బలవంతం చేయసాగారు. కానీ ఆమె ఒక్క రోజు కూడా ఎక్కువ ఎవరి దగ్గరా వుండలేదు. తనకు ఏ కొడుకు అన్నా ప్రత్యేకమైన అభిమానం లేదని చెప్పకనే చెప్పింది.

తన 84వ జన్మదినోత్సవానికి కొద్ది రోజుల ముందు ఆమె నిద్రలోనే ప్రశాంతంగా కన్నుమూసింది. ఆమె అంత్యక్రియలకు హాజరైన స్నేహితురాలు జింగ్-మెయ్ భరిణ తాళం చెవిని లింగ్ కొడుకులకు ఇచ్చి, వెళ్లిపోయింది.

కొడుకులు, కోడళ్లు అందరూ సంభ్రమాశ్చర్యాలతో ఆ ముసలమ్మ గదిలోకి వెళ్లారు. వాళ్లు గత కొన్ని సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న రోజు అది. తలుపులకు లోపలి నుండి గడియపెట్టి ఆ భరిణ చుట్టూ మూగారంతా. వణుకుతున్న చేతులతో పెద్ద కొడుకు తాళం చెవిని భరిణ రంధ్రంలో పెట్టి తిప్పాడు.

అది చిన్న శబ్దం చేస్తూ తెరుచుకుంది. నెమ్మదిగా మూత తెరిచాడు. అందులో ఏమున్నాయోనని అందరూ ఊపిరి బిగబట్టి చూస్తున్నారు. నమ్మశక్యంగాకుండా గులకరాళ్లు బయటపడ్డాయి.

"వజ్రాలు బహుశా అడుగున వుండొచ్చు" అంటూ పెద్ద కొడుకు దాన్ని బోర్లించాడు. తల్లి రాసి పెట్టిన ఒక చీటీ బయటపడింది. అందులో

"డబ్బే ముఖ్యమని భావించే వాళ్లకు ఇది చదివాక నిరాశ కలగవచ్చు. తన కొడుకులు తనను సక్రమంగా చూసుకునేలా ఒక తల్లి ఏదో ఒక తంత్రం చేయాల్సిరావడం బాధాకరం. అది కొడుకులలో మాత్రమేగాక తల్లి పెంపకంలోని లోపాన్ని సూచిస్తోంది. మీరు మీ జీవిత వంథాను మార్చుకోడానికి ఇంకా సమయం వుంది. అలా మారటానికి ప్రయత్నించమనే నా ఈ ఆఖరి సందేశం" అని రాసి వుంది. (చైనా జానపద గాథ)



చిన్నారి చిత్రకారులు



ఎమ్.అవినాష్, 7వ తరగతి, శ్రీసరస్వతి విద్యాలయం, కంచరాం.



వి.సౌమ్య, 5వ తరగతి, ఈమని.



బచ్చలకూరి గౌతమ్, 8వ తరగతి, చింతూర్, ఖమ్మం.

వీరి వీరి గుమ్మడిపండు...

వీరి పేరేమి?

హేయ్ం! ఈ వారం మీ ముందుకు వచ్చినవారెవరో మీకు తెలుసని మాకు తెలుసులే. ఆయనను ప్రేమతో '..... .....' అని పిలుస్తారు. అదేంటో కార్డుమీద రాసి పంపాలి. ఓకేనా! మా చిరునామా: వీరివీరి గుమ్మడిపండు వీరిపేరేమి? బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్టేట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

గతవారపు జవాబు: సరోజినీ నాయుడు

సరైన సమాధానాలు రాసినవారు

ఎస్‌కె.అజ్మత్ అలీ, 10వ తరగతి, ఎస్‌కె. అష్రఫ్ అలీ, 8వ తరగతి, ఎస్‌కె.నుస్రత్ పర్వీన్, 6వ తరగతి, జిహెచ్‌ఎస్, టేకులపల్లి, ఖమ్మం. ఆర్.దుర్గాదేవి, 10వ తరగతి, పెద్దాపురం. యు.అనీష్, ఎ.నాగభూషణం, 10వ తరగతి, కొల్లిపర, గుంటూరు. బూరాడ నాగేంద్రబాబు, 10వ తరగతి, పాలకొండ, శ్రీకాకుళం. కె.సునిల్ కుమార్, 10వ తరగతి, నాగర్‌కర్నూల్. పి.అమర్‌జయసింహ, 6వ తరగతి, గవరపాలెం. జగన్నాథం మహేష్‌బాబు, 5వ తరగతి, సత్యసాయి, మంగళగిరి. మక్కెన హరీష్ కుమార్, చినకాకాని, గుంటూరు. పి.కార్తికేయచారి, 6వ తరగతి, బద్దిపడగ, మెదక్. బస్వా భార్గవి, 8వ తరగతి, మురపాక, శ్రీకాకుళం. పి.రాజేష్, 9వ తరగతి, పి.స్వరూప, 10వ తరగతి, ఈమని. పాగల నాగప్రశాంత్, నాగశాంతి, 7వ తరగతి, బసినికొండ, చిత్తూరు. కె.విజయ్‌కుమార్, 10వ తరగతి, వెంకటాపురం, ఖమ్మం. సి.శరత్‌కుమార్, 8వ తరగతి, నకిరేకల్, నల్గొండ. ఆలిబిల్లి సంపత్‌కుమార్, 7వ తరగతి, నర్సాపురం, ప.గో. బచ్చల రమేష్, 7వ తరగతి, నర్సాపురం, ప.గో. వి.శ్వేత, 6వ తరగతి, నెల్లూరు. ❄



వి'చిత్రం'

చిన్నారులూ! ఇవా
వి'చిత్రం' చూశారా! ఈ
బొమ్మలో మీకే
కనిపిస్తున్నాయి? తొందరే
లేదులే. ప్రశాంతంగా
నిదానంగా చూసి చెప్పండి
ఆ... కొందరు నేస్తాల
చెప్తామంటున్నారు. ఈ
బొమ్మలో కొన్ని చెట్ల
పొదలు, ఇద్దరు సైనికుల
లాంటి వ్యక్తుల
వున్నారంటున్నారు. ఇంత
వరకు ఓకే. కానీ... వీరిద్దరూ
కలిసి ఒకరిని
వెతుకుతున్నారు. వార
కూడా ఈ బొమ్మలోనే
వున్నారు. కనుక్కోండి
చూద్దాం. జవాబు
కావాలంటే పేజీ
తిరగేసి చూడండి.

జవాబు



UY
TTE
IILM
LCEA
IACGM
TPTNE
IAREGL
ECITAI
SACIWAG
NXSCATP
LNJPTEXC
HROHTRAV
WHOLESALE
TRANSFORMERVEBEFDS
SWITCHEENILREWOPER
TURBINETPEAKLOADTE
EGATLOVSADDDJNDGAS
NIGGBIELN
RRJGRNUE
IEGJEEGD
DTHCREN
UXLTARO
THATBC
TBTOAT
KBRSN
SAZEE
NQLR
WIOR
PAU
DC

ఇంగ్లీషు పజిల్-14

హలో! ఈ వారం ఇంగ్లీష్ పజిల్ దేనిమీద అనుకుంటున్నారు? కరెంటు మీద. ఎలక్ట్రిసిటీకి సంబంధించిన కొన్ని పదాలు పక్క బొమ్మలో వున్నాయి. వాటిని మీరు గుర్తించి కార్డుమీద రాసి పంపాలి. మా చిన్నారులకు ఇంగ్లీషు బాగా వచ్చంట. ఆ పదాలు ఏంటో కనిపెట్టి రాస్తారంట. సరేనా. మరి మా చిరునామా: **ఇంగ్లీషు పజిల్**, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్ నగర్, హైదరాబాదు. ❋

ఇంగ్లీషు పజిల్-13 జవాబులు

Plane	Car
Steel	Heater
Stove	Lamp
Train	Machine

తేడాలు కనుక్కోండి

హాయ్! నేస్తాలూ! ఈ వారం మీ ముందుకు రెండు ఏనుగులు వచ్చాయి. ఈ రెంటికీ అస్సలు పడదు. ఎప్పుడూ నేనే గొప్పంటే నేనే గొప్పని పోట్లాడు కుంటుంటాయి. ఓసారి ఏనుగుల పండుగకు అవి రెండూ పోటాపోటీ మీద ఒకేలా తయారయ్యాయి. కాకపోతే కొన్ని తేడాలున్నాయి. అవేంటో చిటికెలో కనిపెట్టాలి మీరు. రెడీనా.

A



B



ఈ తేడాల గొడవేంట్రా బాబూ! అనుకుంటున్నారా! అదేంలేదర్రా! ఈ రెండు బొమ్మల్లోనూ 7 తేడాలున్నాయి. అవి మీరు కనిపెట్టాలి. అంతే. ❋

అమ్మో! గొంగళిపురుగు!!

పిల్లలూ! ఈ వారం మీ ముందుకు గొంగళి పురుగు వచ్చిందర్రా! భయపడాల్సినదేం లేదు. కాగితంతో చేసిందేలే! ఎలా చేయాలి? ఏమేం కావాలి? వంటి వివరాలన్నీ కింద వున్నాయి. మరి గబగబా చదివేసి మొదలెట్టండి.

కావలసిన వస్తువులు: మందపాటి పేపర్, కత్తెర, దారం, గమ్, క్రేయాన్లు.

చేసే విధానం: ముందు 1×6 అంగుళాల కాగితాలు 13 కత్తిరించుకోండి. 4×4 అంగుళాల కాగితం మరొకటి కత్తిరించండి. వీటన్నిటికీ ఆకుపచ్చ రంగు వెయ్యండి.

1×6 కాగితాలను ఒక్కొక్కటి తీసుకుని రింగులా తయారుచేసి గమ్‌తో అతికించండి. ఈ రింగులన్నిటినీ కలుపుతూ ఓ గొలుసు తయారుచెయ్యండి.

చతురస్రాకారపు కాగితం తీసుకుని ఒక సున్నా గియ్యండి. దాన్ని కత్తిరించండి. ఇది గొంగళిపురుగు తల అన్నమాట. ఇందులో కళ్లు, నోరు గీసుకోవాలి. తర్వాత త్రికోణాకారంలో రెండు కొండేలలాంటివి గియ్యండి. వీటితోనే గొంగళిపురుగు ఆకులను తింటుందని మీకు తెలుసుగా. దీన్ని ముందుగా మనం తయారుచేసుకున్న గొలుసుకు ఒక చివరన అతికించాలి. అంతే గొంగళిపురుగు రెడీ.



ఇప్పుడు ఈ గొంగళిపురుగు తల దగ్గర ఓ దారం కట్టి. ఒక ఆట ఆడించొచ్చులే. మీరు చేసిందికాక, మీ స్నేహితులతోనూ చేపించాలి. ఓకేనా!



పేపర్ బొమ్మలు ఎలా వుంటున్నాయి?

ఫ్రెండ్స్! మీకు నాలుగైదు వారాల నుంచి పేపర్‌తో బొమ్మలు చెయ్యడం నేర్పిస్తున్నాం కదా. అవి ఎలా వున్నాయి? చదివి చెయ్యగలుగుతున్నారనుకుంటున్నాం. ఇలాంటివి మీకేమైనా తెలిస్తే మాకు రాసి పంపండి. ఎంచక్కా మీ పేరు, తరగతి, ఊరుతో సహా ప్రచురిస్తాం. మా చిరునామా: **పేపర్ బొమ్మలు**, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్ నగర్, హైదరాబాదు. ❋

రియల్ స్టోరీ

స్వయం 'శక్తిరాణి'

పొత్తూరి రాజేంద్రప్రసాద్ వర్మ



బోగన్‌విల్లా చెట్లు నుంచి పూలు మంచు బిందువుల్లా కిందకు రాలుతున్నాయి. దూరంగా మైకులో వస్తున్న భక్తి సంగీతం గాలిలో మంద్రంగా తేలుతూ మనసులో పులకరింతలు రేపుతోంది. పక్కన ఏపుగా ఎదిగిన తురాయి చెట్లు నుంచి రాలిపడ్డ ఆకుల గుంపులో కాకులు ఏవో వెతుక్కుంటున్నాయి.

చెట్ల నుంచి వీస్తున్న గాలి వేణువు ఊదుతోంది.

మధ్యాహ్నం ఎండ తీవ్రంగా ఉన్నా వీస్తున్న గాలి వల్ల వేడి అనిపించడం లేదు.

చెన్నయ్ శివారులో ఈజంబాక్కం గ్రామానికి దూరంగా వున్న ఆ ప్రాంతంలో చుట్టూ చెట్లు అందమైన ఇళ్ళతో ప్రశాంతంగా ఉంది.

చెట్లు కింద చక్రాల కుర్చీతో శక్తిరాణి అక్కడికి వచ్చింది.

ఇరవై నాలుగేళ్ళ వయస్సులో జీవితసారాన్ని అంతా చవి చూసినట్లుగా గంభీరం ఆమె ముఖంలో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

ఎర్రతురాయి చెట్లు కింద ఆగింది.

పూలు కిందకు రాలుతూ వున్న దృశ్యం ఆమెను ఎంతగానో ఆకట్టుకుంది. ఎర్రటిపూలు చెట్టుకు కిరీటంలా అందంగా అమరి వున్నాయి.

ఆ దృశ్యాన్ని చూస్తూ ఉండిపోయింది.

ప్రతిరోజూ చక్రాల కుర్చీని ఆ ప్రాంతానికి తీసుకువస్తుంది.

చెట్టు కింద కూర్చుని ప్రకృతిని తిలకిస్తుంది.

ఉదయం పూట, సాయంత్రం పూట తురాయి చెట్లు కింద కూర్చుని పూలవానలో తడవడం ఆమెకు ఇష్టం. అటువంటి సమయంలోనే ఆమెలో కళాహృదయం నిద్రలేస్తుంది. ప్రకృతిలో మమేకమైన సమయంలో ఆమె మనసు కేన్వాసుపై అందమైన చిత్రం రూపుదిద్దుకుంటుంది. ఆ సమయంలో తనతో తెచ్చుకున్న చిన్న పుస్తకంలో పెన్సిల్‌తో అస్పష్టమైన స్కెచ్ గీసుకుంటుంది. అలా గీసుకున్న రకరకాల ఆలోచనలను ఇంటివద్ద కూర్చుని అందమైన చిత్రాలుగా రూపొందిస్తుంది.

శక్తిరాణి చెట్టుకింద కూర్చుని తన్మయంతో పరిసరాలను గమనిస్తోంది. రోజూ ఒకే ప్రాంతానికి వస్తున్నప్పటికీ ఆమెకు విసుగు అనిపించదు. ఎన్నిసార్లు ఆ ప్రాంతానికి వచ్చినా కొత్తగానే అనిపిస్తుంది.

అందమైన పరిసరాల్లో ఆనందంగా పరుగులు తీయాలని, నెమలిలా నాట్యం చేయాలని శక్తిరాణికి ఎప్పుడూ అనిపిస్తుంది. కానీ చక్రాల కుర్చీలోంచి లేవలేని తన అశక్తత గుర్తుకువచ్చి మనసు కలుక్కుమంటుంది. అటువంటప్పుడు ఆమె పోలియోతో కుంచించుకుపోయి తోటకూరకాడల్లా వేలాడే తన కాళ్ళను చూసుకుంటుంది. ఒక్క క్షణం కళ్ళల్లో నీళ్ళు తిరుగుతాయి. అయితే ఆ స్థితి నుంచి వెంటనే బైటికి వచ్చేస్తుంది. మళ్ళీ మామూలు ప్రపంచంలోకి వచ్చేస్తుంది.

తల పైకెత్తి చెట్లు కొమ్మలోంచి జాలువారుతూ ఏటవాలుగా పడుతున్న సూర్యకిరణాలను పరికిస్తుండగా "రాణీ! ఇంటికి వెళ్ళిపోదామా?" అంది మీనాక్షి.

తల్లి మాటలు విని వెనక్కి తిరిగింది శక్తిరాణి.

"ఏమ్మా! అప్పుడే వచ్చేశావు. భోజనం టైం కాలేదు కదా?"

"నేను వస్తే భోజనానికి తీసుకుపోవడానికే వచ్చానని ఎందుకు అనుకున్నావు. నీకు ఫోను వచ్చింది. ఆ విషయం చెప్పడానికే వచ్చాను" తల్లి చెప్పింది.

తల్లివైపు చూసి చిన్నగా నవ్వింది.

"ఎవరో నీ చిత్ర కళా ప్రదర్శన ఏర్పాటు చేస్తారట!"

శక్తిరాణి చక్రాల కుర్చీని ఇంటివైపు తిప్పింది.

"అరగంట తర్వాత మళ్ళీ ఫోన్ చేయమని చెప్పానులే!" అంటు చక్రాల కుర్చీని పట్టుకుని ఇంటివైపు నడిపించింది.

శక్తిరాణి నిశ్చింతంగా కూర్చుంది.

***

తమిళనాడులో తంజావూరు జిల్లాలో కుంభకోణం గ్రామానికి చెందిన తంగరాజ్, మీనాక్షి దంపతుల గారాల పట్టి శక్తిరాణి. పుట్టినప్పుడు ఇంట్లో మహాలక్ష్మి వెలిసిందని అందరూ ఎంతో సంతోషించారు. కేరింతలు కొడుతూ కాళ్ళు చేతులు అందంగా కదిపే శక్తిరాణిని చూసి దంపతులు ఇద్దరూ పొంగిపోయారు. తమ కలలరాణి ఇంటిలో వెలిసిందని ఆనందించారు.

రెండు పుట్టిన రోజులు గొప్పగా జరిపారు.

బంధువుల్ని, మిత్రుల్ని అందరినీ పిలిచి భోజనాలు పెట్టి తమ ఆనందాన్ని వారితో పంచుకున్నారు.

ఆ పాప మూడేళ్ళ వయసులో వారి మనసుకు గాయమైంది.

శక్తిరాణికి ఉన్న పోలియోవ్యాధి బైటపడింది.

ఆమె రెండుకాళ్ళూ పోలియోకి గురయ్యాయి.

అందరి పిల్లల్లా శక్తిరాణి నడవడానికి వీలులేకపోయింది. ఆ చిన్న వయసులోనే ఆమె దుఃఖంలో కూరుకుపోయింది. తన తోటి పిల్లలంతా ఆడుతూ గెంతుతూ పరుగెడుతుంటే వారివైపు జాలిగా చూసేది.

కూతురు శక్తిరాణి పరిస్థితిని చూసి తల్లిదండ్రులు ఇద్దరూ తల్లడిల్లిపోయారు. తమ ఏకైక కుమార్తె కాళ్ళు చచ్చుబడిపోయి, నడవలేని స్థితిలో పడిపోవడం వారు జీర్ణించుకోలేకపోయారు. కూతురితో పాటు తాము కూడా బాధపడుతూ కూర్చునేకన్నా ఆమెకు మానసిక స్థయిర్యం కల్పించాలని నిర్ణయించుకున్నారు.

నడవడానికి అవకాశం లేని శక్తిరాణికి ధైర్యం కలిగించారు. ఆమెకు అండగా నిలిచారు. ధైర్యం చెప్పారు. ఆమెలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించారు. దగ్గరలో ఉన్న పాఠశాలకు ప్రతిరోజూ తీసుకువెళ్ళి తీసుకువచ్చేవారు. ఏడవ తరగతి పరీక్ష రాసిన తర్వాత ఆమె పాఠశాలకు వెళ్ళలేకపోయింది.

తండ్రి తంగరాజ్ సైనికాధికారిగా పనిచేసి పదవీ విరమణ చేశారు. అతనికి అంతవరకూ ఉన్న వ్యాపకాలేవీ లేకపోవడంతో పూర్తి స్థాయిలో కూతురుపైన దృష్టి సారించారు. తల్లి మీనాక్షి గృహిణి కావడంతో భర్తకు సహకరించింది. దీంతో శక్తిరాణిపై తల్లిదండ్రుల ప్రభావం తీవ్రంగా పడింది.

పాఠశాలకు వెళ్ళలేని కూతురుకి ఇంటివద్దే ట్యూషన్ ఏర్పాటు చేశారు. టీచరు వెళ్ళిపోయిన తర్వాత నేర్చుకున్న పాఠ్యాంశాలను కూతురుతో చదివిస్తూ పాఠాలను అప్పజెప్పించుకునేవారు. దీంతో శక్తిరాణి తెలివైన అమ్మాయిగా తయారైంది. ఎనిమిదవ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకూ ప్రైవేటుగా పరీక్షలు రాసి మంచి మార్కులు సంపాదించింది. ఆమెను పరీక్షల సమయంలో పరీక్షా కేంద్రాలకు తీసుకుని వెళ్లడం, తీసుకురావడం చేసేవారు.

ఇంటర్ పాసైన తర్వాత తండ్రి తంగరాజ్ ఆమెకు చిత్రకళకు సంబంధించిన కొన్ని పుస్తకాలు ఇచ్చారు. రోజంతా ఇంటిలో చక్రాల కుర్చీపై కూర్చోవడం వల్ల విసుగు వస్తుందని పుస్తకాలు చదవడంతో ఆమెకు ఆసక్తిని కలిగించారు. పుస్తకాలు చదువుతూ శక్తిరాణి చిత్రకళపై ఆసక్తిని పెంచుకుంది. దానికి సంబంధించిన పుస్తకాలను తెప్పించి చదవడంతో మరింత ఆసక్తి పెరిగింది.

కుంభకోణం ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో చేరింది.

బాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో చేరిన తర్వాత

శక్తి రాణికి చిత్రకళపైన విపరీతమైన ఆసక్తి పెరిగిపోయింది. టీచర్లు చెప్పే విషయాలను శ్రద్ధగా నేర్చుకునేది. కొలతలు ఆధారంగా బొమ్మలు గీయడం, దూరం నుంచి ప్రకృతి చిత్రాలు చిత్రీకరించడం వంటి విషయాలు నేర్చుకుంది. ఆ ఆసక్తితోనే మాస్టర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ కోర్సులను కూడా మంచి మార్కులతో పూర్తి చేసింది.

అప్పుడే అనుకుంది చిత్రకారిణి కావాలని.

తల్లిదండ్రులతో ఆ విషయాన్ని చెప్పింది.

తండ్రి తంగరాజ్ ఎంతో సంతోషించాడు. చిత్రాలు గీయడానికి ఒక స్టాండ్ తయారు చేయించాడు. వాటిమీద అమర్చడానికి తెల్లకాగితాలను సిద్ధం చేశాడు. రంగురంగుల డబ్బాలు రకరకాల సైజుల బ్రెష్‌లను తీసుకువచ్చి ఇంట్లో అమర్చాడు.

తండ్రి ప్రోత్సాహానికి పొంగిపోయింది.

"అమ్మా! రాణీ... నువ్వు అందరిలో ప్రత్యేకతను సాధించాలి. నీకున్న పరిస్థితిలో నువ్వు కృషి చేయవలసింది ఇదే. మంచి చిత్రకారిణిగా నువ్వు అందరి ప్రశంసలు పొందాలి. నీకున్న వైకల్యం నీకూ, మరెవరికి కూడా గుర్తు రాకూడదు. నువ్వు చిత్రించే చిత్రాలు నీకు కీర్తి పతాకాలను తెచ్చిపెట్టాలి. నీవు అంగవైకల్యాన్ని అధిగమించడానికి నువ్వు ఎంతగానో కృషి చేయాలి. నీ ప్రత్యేకత చూపించాలి." తండ్రి చెబుతున్న మాటలు శక్తిరాణిలో బలంగా ముద్ర వేశాయి. తల్లిదండ్రుల కోర్కెలకు అనుగుణంగా కృషి చేసింది.



***

శక్తిరాణి చిత్రకళా రంగంలో విశేషంగా కృషి చేసింది.

డాన్సుపైన ఆమెకున్న ఆసక్తి కారణంగా అనేక రకాల కళాకృతుల్ని ఆమె సృష్టించింది. విభిన్న తరహా నాట్య భంగిమలు ఈ చిత్రాల్లో కనిపిస్తాయి. సమాజంలో మహిళల ఔన్నత్యాన్ని తెలియజేసే రకరకాల చిత్రాలు కనువిందు చేస్తుంటాయి. ప్రకృతి దృశ్యాలు లెక్కలేనన్ని ఈమె చిత్రీకరించేది. ఇతర చిత్రకారుల కన్నా భిన్నంగా ఈమె చిత్రాలు ఉండటంతో ఎవరు చూసినా శక్తిరాణి చిత్రాలను ఇట్టే గుర్తిస్తారు. చాలా చిత్రాలు విలక్షణంగా ఉండటమే కాకుండా ఆలోచించే విధంగా ఉంటాయని అందరూ చెబుతారు.

తమిళనాడులో ప్రసిద్ధి చెందిన పద్మా సుబ్రహ్మణ్యం రాసిన నాట్యాంజలి అనే పుస్తకంలో వివిధ రకాలుగా వున్న అభినయ భంగిమలను ఆధారంగా చేసుకుని వందలాది కళా ఖండాలను శక్తిరాణి సృష్టించింది. ఈమె రూపొందించిన చిత్రాల వల్ల నాట్యాంజలి పుస్తకానికి ప్రత్యేకమైన గుర్తింపు లభించింది.

దీంతో శక్తిరాణి తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి రాసిన కురళోవియం అనే పుస్తకంలో వివిధ అంశాలను చిత్రాల రూపంలో తీసుకువచ్చే అరుదైన అవకాశం లభించింది. ఈ గ్రంథంలో 1330 అంశాలను చిత్రలేఖన రూపాన్ని కల్పించడంలో కృతకృత్యురాలైంది. దీంతో ఈమె పేరు మారుమోగిపోయింది. కాళ్ళూ రెండూ పనిచేయని స్థితిలో ఆమె చేసిన కృషిని ఎంతో మంది మెచ్చుకున్నారు.

ఆ తర్వాత తాను రూపొందించిన చిత్రాలతో ప్రదర్శనలు ఏర్పాటు చేయడానికి ప్రయత్నించింది. ఇందులో భాగంగా దేశంలో వివిధ పట్టణాల్లో ప్రదర్శనలు ఏర్పాటయ్యాయి. ప్రదర్శనలతో పాటు పురస్కారాలు కూడా శక్తిరాణి సొంతమయ్యాయి.

1997 నుంచి చెన్నయ్, కుంభకోణాల్లో ఈమె ఏర్పాటు చేసిన ప్రదర్శనలు ఎంతోమంది ప్రశంసలు పొందాయి. 1998లో ముంబయిలో అఖిల భారత చిత్రకళా ప్రదర్శనలో ప్రత్యేక పురస్కారాన్ని పొందింది. అదే సంవత్సరం తంజావూరులో లలిత కళా సమ్మేళనం నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో మొదటి నగదు బహుమతి పొందారు. కుంభకోణంలో 'తల్లిపాల ఆవశ్యకత' అనే అంశంపై జరిగిన పోటీలో ప్రథమ బహుమతి పొందింది. 1999లో విశాఖపట్నంలో జరిగిన కళాపరిషత్ పోటీలో అఖిల భారత స్థాయిలో అవార్డు 2000లో న్యూఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయిలో చిత్రలేఖన ప్రదర్శన ఏర్పాటు చేయగా స్వర్ణ పతాకాన్ని శక్తిరాణి సాధించింది. అదే ఏడాది చెన్నయ్ లలిత కళా అకాడమీ ఆధ్వర్యంలో తన కళాఖండాలను ప్రదర్శించింది. కడలూరు ప్రభుత్వ మ్యూజియంలోనూ 2002లో చెన్నయ్‌లో రష్యన్ కల్చర్ సెంటర్‌లోనూ ఈమె చిత్రాలు ప్రదర్శింపజేయగా ఎంతోమంది మెచ్చుకున్నారు. అఖిల భారత స్థాయిలో న్యూఢిల్లీలో జరిగిన చిత్రలేఖన పోటీలోనూ, జపాన్‌లో నిర్వహించిన తపాలా బిళ్ళల రూపకల్పన పోటీల్లోనూ ఈమె బహుమతులను ప్రశంసా పత్రాలను సంపాదించింది.

ఎన్ని సాధించినా ఇంకా తాను సాధించవలసి ఉందని శక్తిరాణి తనను కలసిన వారందరితో చెబుతూనే ఉంటుంది. నిరంతర కృషితో రకరకాల చిత్రాలను రూపకల్పన చేయడంతో ఆమె ఎప్పుడూ ఉత్సాహం చూపించేది.

***

శక్తిరాణి ఇంటిలో ఫోన్ మోగింది.

చక్రాల కుర్చీని టేబుల్ వద్దకు జరిపి వచ్చిన ఫోను అందుకుంది. కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి నుంచి, 2002-04 సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పర్యాటక సాంస్కృతిక శాఖ నుంచి స్కాలర్‌షిప్ మంజూరు చేస్తున్నట్లు ఫోన్ సమాచారం. త్వరలో పోస్టులో ఉత్తర్వులు పంపిస్తామని తెలియజేశారు.

శక్తిరాణి ఎంతో ఆనందించింది.

ఇంతవరకూ తల్లిదండ్రులపై ప్రతి విషయానికీ ఆధారపడ్డ తనకు ఇకపై ఆర్థికంగా వెసులుబాటు కలుగుతుందని సంతోషపడింది. చిత్రాలు గీయడానికి అవసరమైన సామాగ్రి కొనుగోలు చేయడానికి, చిత్ర ప్రదర్శనలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం మంజూరు చేసే స్కాలర్‌షిప్ ఉపయోగపడుతుందని ఆమె భావించింది.

రెండురోజుల తర్వాత స్కాలర్‌షిప్‌కు సంబంధించి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. వాటిని చదువుకుని శక్తిరాణి తల్లిదండ్రులకు చూపించింది. "అమ్మా రాణీ! నీ కృషి మరింతగా కొనసాగించడానికి అవకాశం కలిగింది. ఇందుకు తగిన కృషిని ప్రారంభించు!" తండ్రి తంగరాజ్ కూతురు ఉత్సాహాన్ని చూసి అన్నాడు.

"స్కాలర్‌షిప్ రావడం సంతోషంగా ఉంది నాన్నా! ఇంతవరకూ ప్రతి చిన్న అవసరానికి రిటైరయిన నీ మీదే ఆధారపడేదానిని. ఇకపై అటువంటి పరిస్థితి ఉండదు!" అంది.

"నీ ఖర్చు మాకెప్పుడూ భారం కాదమ్మా!" శక్తిరాణి తల్లి మీనాక్షి కూతుర్ని దగ్గరకు తీసుకుని అంది.

తల్లిదండ్రుల ఆప్యాయత శక్తిరాణి కళ్ళలో ఒకలాంటి ఆనంద బాష్పాలను కలిగించాయి.

తర్వాత సాయంత్రం చక్రాల బండిని తోసుకుని తురాయిచెట్లు వద్దకు వెళ్ళింది. చుట్టూ ఎర్రెర్రని పూలతో ఉన్న చెట్లమధ్య ఒంటరిగా కూర్చుంది.

ప్రకృతి పరవశింపజేసేలా ఉంది.

గాలికి చెట్లు ఊగుతున్నాయి. శక్తిరాణి ముంగురులు కూడా ఎగురుతూ దోబూచులాడుతున్నాయి. ఆమె మనసు ఎంతో ప్రశాంతంగా ఉంది. చిత్రాలకు స్కెచ్‌లు గీసుకునే చిన్న పుస్తకం బయటకు తీసింది. మొదటి రెండు పేజీల్లో ఏవో బొమ్మలున్నాయి. మూడవ పేజీలో పెన్సిల్‌తో రాయడం మొదలుపెట్టింది.

"చిత్రలేఖనం ధ్యానంతో సమానం. ఇందులో దొరికే తృప్తి, శాంతీ ఎందులోనూ దొరకదు. నాట్యం చేయలేని తాను చిత్రాలతో రకరకాల భంగిమలను సృష్టిస్తాను. సమాజంలో వికలాంగులను అందరితో సమానంగా చూడాలి. అలా చూడాలని మొదట గుర్తించింది నా తల్లిదండ్రులు...వారు సృష్టించిన శక్తిరాణిని... మరిన్ని చిత్రాలు సృష్టించడానికి సమాయత్తం అవుతాను. ఎప్పటికీ వారే నా తల్లిదండ్రులు...ప్రత్యక్షదైవాలు..." అలా రాసినదాన్ని రెండుమూడుసార్లు చదువుకుంది. శక్తిరాణి సంతృప్తిగా ఊపిరిపీల్చుకుంది.

సరోజిని

వాళ్ళ సీట్లలో వాళ్లనే కూర్చోనిద్దాం...



కర్ర విరగకుండా, పాము చావకుండా అంటారే అలా మాట్లాడటం కొందరికే చెల్లుతుంది అంటాడు మా తమ్ముడు.

అలా ఎందుకంటున్నావు ఎవరైనా లౌక్యంగా మాట్లాడాలనే అనుకుంటారు గదా అన్నా వినిపించుకోడు.

అందరూ అంత సౌమ్యంగా, లౌక్యంగా ఉంటే ఈ గొడవలు, గందరగోళాలు, మారణకాండలెందుకంటాడు.

వాడు తన వాక్చాతుర్యంతో ఎవరినైనా ఇట్టే మెప్పించగలడు. అదే సందర్భంలో తాను చాలా చతురుడనే బిరుదూ కొట్టేయగలడు. ఎవరినీ నొప్పించకుండానే కొండొకచో మెప్పులు కూడా పొందగలగడం మా జన్మహక్కంటాడు.

నువ్వు అంత కచ్చితంగా ఎలా చెప్పగలుగుతున్నావంటే నేనూ అదే కేటగిరీ కాబట్టి అంటాడు. అందుకే నాకున్నంత లౌక్యం నీకెన్నటికీ అబ్బదు అనికూడా అంటాడు.

ఇదేమి అన్యాయంరా బాబూ అంటే మన కళ్ళముందే ఉన్న ఉదాహరణలను చూపుతాడు. వాటిలో నుంచే ఎన్నో జీవిత సత్యాలను చూపుతాడు.

ఈసారి మనం రోజూ ప్రయాణించే బస్సులోని రాతలను చూపిస్తానన్నాడు.

'బస్సులో పొగతాగరాదు' అని ఆదేశించిన అధికారులే 'స్త్రీలను గౌరవించడం మన సంప్రదాయం. వారికి కేటాయించిన సీట్లలో వారిలో కూర్చోనిద్దాం' అంటారు. అంటే ఈ రెండూ రాసింది మగ అధికారులే గదా! ఈ రెండవ స్లోగన్‌లో వెతకవైఖరి ఎందుకంటావు అని ఛాలెంజ్ విసురుతాడు.

నా తమ్ముడు కూడా ఇంత తర్కబద్ధంగా ఆలోచిస్తున్నందుకు నాకెంతో ఆనందమేసింది. అసలు బస్సులో ప్రయాణించే మహిళలెవరూ దీన్ని గురించి ఆలోచించి ఉండరు కూడా.

ఇక్కడి తర్కం మీకూ అర్థమయ్యే ఉంటుందనుకుంటా. ఒకటేమో ఆర్డర్.. రెండోదేమో మా దయ మీ ప్రాప్తి అన్నట్లులేదూ?.. అంటే ఇది రాయించిన అధికారులకే ఆ సీట్లు కేటాయించడం సుతరామూ మాకు ఇష్టంలేదు అన్నట్లు లేదూ...

స్త్రీలకు కేటాయించిన సీట్లలో కూర్చోవడమే తప్పు. స్త్రీల సీట్లలో కూర్చొని నిద్ర నటించడం, ఎటో చూస్తూ ఆలోచనల్లో మునిగిపోయినట్లు నటించడం చేస్తుంటారు. గట్టిగా అడిగితే తాము అప్పుడే చూసినట్లు ప్రవర్తిస్తారు కొందరు. అసలేమీ పట్టనట్లే ఉంటారు మరికొందరు. ఒకవేళ ఆ సీటు ఖాళీ చేయమని అడిగితే అక్కడో మహాసంగ్రామమే మొదలవుతుంది. సీటు అడిగిన వాళ్ళు పెద్ద విలన్లలాగా అక్కడ కూర్చున్న మగ మహారాజులకు కన్పిస్తారు.

కనీసం చంకలో పిల్లల్తో ఉన్నా లేవని వాళ్ళను ఏమనాలో నువ్వే చెప్పు అంటాడు. కొందరు కొంచెం బుద్ధిమంతులు కూడా ఉంటారనుకో అని కూడా సమర్థిస్తుంటాడు.

నువ్వు చెప్పింది నిజమే అనుకో. అయినా ఏమి చేయగలం. పుట్టుకతో వచ్చిన అహంకారం అంత తేలికగా వదులుతుందా మరి అంటే..

దాన్ని వదిలించాలంటే ఎంత కష్టపడాలో మీరూ ఆలోచించవద్దా అని ప్రశ్నిస్తాడు. అలాగని వారిని అలాగే వదిలితే ఎలా? కొంచెమైనా చైతన్యం చూపొద్దా అంటాడు. ఇంత చిన్న విషయంలోనే భయపడితే ఇక పెద్ద విషయాలలో మీరేమి ఎదిరించగలుగుతారో చెప్పు అంటాడు.

కాబట్టి మీ హక్కుల కోసం మీరే పోరాడాలి తప్ప ఇతరులెవరో పోరాడుతారనుకో కూడదు సుమా! కాకపోతే ఇతరుల సహకారం, సహాయం తీసుకోవడంలో తప్పులేదు అంటాడు.

చిన్న విషయాలకోసం పోరాడినప్పుడే పెద్ద విషయాల్లో కూడా ఎదిరించగలుగుతారు. ఆ చైతన్యం ఈ చిన్న విషయాల నుంచే మొదలవ్వాలి కదా!

దీనికి మీరేమంటారు..

“బోల్‌గార్డు – భళిభళీ బి.టి.”

రుక్మిణి

రావిచెట్టు కింద సమావేశం మహారసవత్తరంగా జరుగుతంది – సాయంత్రం కావస్తుంది – యాద్గిరి యమా సీరియస్‌గా మల్లేశాన్ని ఒక ప్రశ్న అడిగిండు.

“అరె మల్లేశా... అసలు మనిషికి ముఖ్యంగా కావల్సినవేందిరా ఆలోచన చేసి చెప్పు.”

మల్లేశం కాస్తంత తల గోక్కుని “ఏముంది – కూడూ, గుడ్డా, గుడిసె” అని వూరుకుండు – వెంటనే జక్కులోడు ‘సెక్సుకూడా’ అని గొణగంగనె యాద్గిరి వాన్ని తన్నినంత పని చేసిండు.

“అరె.. అసలు సంగతి వదిలిపెట్టి పరాచికాల్ చేస్తున్నవ్.. చుప్” అని అరిచి “మల్లేశా కూడు సంగతి సరేసరి – తిన్నా తినకున్నా బయట వాండ్లకు ఎవరికీ మతలబుండదు. కానీ ఒంటిమీద గుడ్డల్లేకుంటే ఏమైతదిరా” అన్నడు.

“వామ్మో... వామ్మో... యాద్గిరన్నా గట్లుంటే ఇంగ కావల్సిందేందే. భలే రంజుగుంటది గాదె... పాతకాలంలోని మనుషుల్లా సొతంత్రంగా తిరగొచ్చు... ఎవడికీ ఎవడితో లొల్లులుండవ్...” అని జక్కులోడు సంబరంగా గుండెలు బాదుకున్నాడు. యాద్గిరి వాడ్ని నిజంగనే తన్నినంత పని చేసిండు.

“అరె గాడ్దికొడ్క... బొక్క లిరగాలె... బరిబత్తల తిరిగితే సంబరమా? అది కాదురా... ఎండకూ చలికీ వంటిమీద వస్త్రం లేకుంటే దెబ్బకు సస్తం గాదుర... ఎదవ” అని గయ్యిమని లేవడంతో జక్కులోడు మొఖమంతా మాడ్సుకుండు.

“దీపాలి పండుగ దగ్గర పడతంది గాదె” మల్లేశం నెమ్మదిగ అనంగనె... దూరం నుండి జక్కులోడి పెండ్లాం మొకమంత మాడ్సుకుని మటమట లాడుకుంట రానేవచ్చింది. జక్కులోడు రుసరుసలాడిండు “ఏందే.. ఇల్లొదిలి తీరుబారుగ ఇటుపడ్డవ్... పొరగాండ్లేం చేస్తుండు” అని వెర్రిగా అరిచాడు. ఆవిడగారు కూడా రెచ్చిపోయి గయ్యిమని ఎగబడింది.

“ఏందేందీ... మద్యాన్నం కడుపునిండతిని, తువాలు బుజానేసుకుని గిపుడే వస్తనని బయటపడి గీడచేరి ముచ్చట్లు పెడ్తన్నవ్... మగడా దీపాలి పండగ దగ్గర పడ్డది...”

“దీపాలి పండక్కి.. నీ ముచ్చట్లకూ లింకేందే...” జక్కులోడు గాండ్రించిండు..

యాద్గిరి ఒక్క గదురు గదిమి “సంగతేందో చెప్పరాదక్కా..: వీడేమైనా అన్నాడా” అని అడిగిండు.

“అది కాదన్నా... దీపాలి పండక్కి నాకో చీరె తెస్తనని బులిపిచ్చి ఇవతల పడ్డడు” అని ఒక రాగం తీసింది. యాద్గిరి భారీ నవ్వోటినవ్వి “ఓర్నీ.. అసలు మనుషులెవరూ ఒంటిమీద గుడ్డ లేస్కోవద్దని ఇప్పటి దనక మాకు లెక్చర్లు దంచిండుగాద..”

జక్కులోడు గుండెలు బాదుకుని రాగిచెట్టుచాటుకు వురికిండు – వాడి పెండ్లాం గబుక్కున



దునికి వాడి రెట్ట పట్టుకుని మళ్ళా గుంజక వచ్చింది.

“గట్లనే మగడా... అయితే గియి ఇప్పు.. నీ పంచె చొక్కా యిప్పి బజార్నపడి తిరుగు... జనం పిచ్చి కుక్కను కొట్టినట్లు కొడతరు... హవ్వ...”

“పోలీసులు బొక్కలో నూకుతరు” మల్లేశం వంత పాడిండు – జక్కులోడు బిత్తరపోయి మూతి మూసుకున్నడు.

“చీర కొనిస్తవా..... లేదా?” ఆవిడ మళ్ళా అన్నది.

“సిలుకు చీర దుక్నంల చూసిపెట్టిన... పో... రంగు చూసుకుని తీసుకుందువుగాని” అన్నడు జక్కులోడు.

“గదేం కుదరదు... నాకు కాటన్ చీరేకావాలె...” ఆవిడ మాటలకు జక్కులోడు చప్టామీద వెనక్కి విరుచుకుపడ్డడు.

“కాటన్ చీరెలంటే మాటలు కాదు... గొప్ప ఖరీదు... ఏమనుకుంట్నవ్... నా కాన గన్ని పైసల్లేవ్... దుకనంల రేట్లడిగిన! నైలాన్.. సిలుకుచీరలు రెండొందలుంటే కాటన్ సరుకు అయిదు వందలు... చాల రేటు!” ఆవిడ ఈ వివరణకు నోరు వెళ్ళబెట్టింది.

“గదేందీ... నూలు దారంతో నేసిన కాటన్ చీరలకు గింత రేటుండుడేంది... గిందులో ఏదో మతలబుంది.. యాద్గిరన్నా... గదేందే” అని అడిగింది.

“సర్సరే నూలు తీయాల్నంటే ఏంకావాలె?”

“పత్తి” మల్లేశం అందుకున్నడు.

“గదే!... మరి... రెండు మూడు సమత్సరాల నుండి మన రైతన్నలను మాయచేసి గీ అమెరికా రకం బోల్‌గార్డు... బి.టి.–12 పత్తి గింజలను తెచ్చిన్రు... వాటికి బోలెడంత ధర.. అదీగాక గా గింజలు పచ్చ పురుగునుండి తట్టుకుంటయ్... హెచ్చు దిగుబడి దిగిపోతది.. అని వూదరగొట్టిరి.. రైతులు అగ్గగ్గమని ఎగబడి పోటీపడి వాటిని చేన్లలో వేసిరి – వాటికి ఖరీదైన మందులు. బోలెడంత పెట్టుబడి.”

“అన్నా మరి గీ గింజల్ని మన వ్యవసాయం ఆఫీసర్లు పరిచ్చలు చేయొచ్చుగద” మల్లేశం అమాయకంగా అడిగిండు.

“విత్తనం దుకాణందారులు వీళ్ళను కూడా నమ్మబలుకుతరు. మొన్న మన వరంగల్‌లో ఏం జరిగింది – మానుకోట డివిజన్‌లో ఏమయింది?”

“ఏమయిందీ?” జక్కులోడు అమాయకంగా అడిగిండు.

“పత్తిమొలిచింది –పూత పూసింది – పిందెకాసింది. పిందె ఎండిపోయింది. రాలిపోయింది.”

“వామ్మో... వామ్మో!” జక్కులోడి భార్య గుండెలు బాదుకుంది.

“గంతే... బోలెడంత పెట్టుబడి.. అధిక వడ్డీలకు తెచ్చిన రైతులు తెగబడి ఆత్మహత్యలు... పురుగుమందులు తాగిసచ్చిరి... దుకాణపోల్లు షాపులు బందు పెట్టింద్ర. ఇంగజెప్పు... మార్కెట్లోకి పత్తి యాడ్నుండి వస్తది. నూలు ధర పెరిగి పోదా... చీరల ధర గపుడు పెరగద... గంతే!”

జక్కులోడి భార్య వాయ్యో... వామ్మో అనుకుంది. ❖

పిప్పిపన్ను వ్యాధిని గుర్తించడం ఎలా?



డా॥ కె.ఎల్.వి.ప్రసాద్

"డాక్టర్ గారూ! ఈ నొప్పిని నేను భరించలేను. ఏదో ఒకటి చేయండి, నాకు త్వరగా ఉపశమనం కలగాలి" అని ఫుల్‌స్టాప్ లేకుండా తనదైన ధోరణిలో మాట్లాడుతున్నాడు దవడవాపుతో డాక్టర్ దగ్గరికి వచ్చిన దశరథం.

"దవడవాపు ఎప్పుడు వచ్చింది? నొప్పి ఎప్పటి నుంచి?" తనదైన శైలిలో అడిగాడు డాక్టర్.

"పంటి నొప్పి మొదలై నెలరోజులు దాటింది. దవడవాచి నాలుగు రోజులైంది. ఇక నేను..." అంటూ ఏదో చెప్పబోయాడు దశరథం.

"చూడు దశరథం అన్ని రోజుల నుండి మందులు వాడకుండా ఎట్లా వున్నావయ్యా?" అన్నాడు డాక్టర్.

"డాక్టర్ సాబ్! మందులు వాడకపోవడం ఏమిటి? మా కాలనీ మందుల షాపువాడి దగ్గర కొనుక్కొని వారం రోజులుపైనే మందులు వాడాను. అప్పటికీ తగ్గకపోతే, అతనే సలహా ఇచ్చారు. చెవిలో పసరు మందు పోయించమని, ఆ పనీ చేశాను, నొప్పి ఎక్కువయింది తప్ప ఏ మాత్రం తగ్గలేదు. అందుకని..."

"సరే! సరే!! కాలనీలో డాక్టరును పెట్టుకొని నువ్వు ఇట్లా బాధపడ్డం, నాటు వైద్యం వైపు మళ్లడం ఏం బాగోలేదు దశరథం. నువ్వు ఈ స్వంత వైద్యం పూర్తి చేసేసరికి నీ పంటి నొప్పి తగ్గలేదు సరికదా వ్యాధి ముదిరి బాధ ఎక్కువయింది. చేతులారా జబ్బును పెంచుకున్నట్లయింది. కనీసం ఇప్పటికైనా వచ్చావు సంతోషం!" అన్నాడు డాక్టరు.

మన సమాజంలో, మన కుటుంబంలో, మన మిత్రుల్లో దశరథం లాంటి వ్యక్తులు చాలామంది వుంటారు. ఎవరో చెప్పిన మాటలు నమ్మి సమస్యలను మరింతగా పెంచుకుంటారు. విషయాన్ని జటిలం చేసుకుంటారు.

నిజానికి దశరథం పిప్పిపన్ను వ్యాధితో బాధపడుతున్నాడు. ప్రాథమిక దశల్లో, పిప్పిపన్ను వ్యాధిని గుర్తించే కనీస జ్ఞానం దశరథంకు వుంటే, వ్యాధిని అంతగా ముదరనిచ్చే వాడు కాదు. దానితోపాటు పన్ను కోల్పోయే పరిస్థితీ ఏర్పడేది కాదు. అతని అశ్రద్ధవల్ల, అతి తెలివి వల్ల, జీవితాంతం అతనితో ఉండవలసిన పంటిని పోగొట్టుకొనవలసిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రాథమిక దశల్లో పిప్పిపన్ను వ్యాధిని ఏ విధంగా పసిగట్టాలన్నది తెలుసుకుందాం.

పిప్పిపన్ను వ్యాధి నిర్ధారణ గురించి తెలుసుకునే ముందు ఏయే పంటి భాగాలలో పిప్పిపన్ను వ్యాధి రావడానికి ఆస్కారం వుందో తెలుసుకోవడం అవసరం. అవి తెలిసి ఉన్నప్పుడే ఆయా భాగాల పట్ల అప్రమత్తంగా వుండే అవకాశం ఏర్పడుతుంది.

దంతాలకు సంబంధించి (మోలార్స్ ధాప్రి-మోలార్స్) - నమిలేభాగం (ఆక్లుజల్ ఏరియా), మీడియల్, డిస్టల్, బక్కర్ (బుగ్గవైపు భాగం), పాటల్ (అంగుటివైపు), లింగ్వర్ (నాలుక వైపు) భాగాలను కలిగి వుంటాయి. వీటిల్లో పిప్పి వ్యాధి రావడానికి అవకాశమున్న భాగాలు, నమిలే భాగం, మీడియల్ రీడిస్టల్ (ప్రాక్సిమల్) భాగాలు. అందుచేత ఆయా భాగాలను జాగ్రత్తగా పరిశీలించడం ద్వారా, అక్కడ జరిగే మార్పులను బట్టి పిప్పి పన్ను ఆవిర్భావాన్ని గురించి కొంతలో కొంతైనా తెలుసుకునే అవకాశం ఉంది.

మామూలుగా అయితే, ఆరోగ్యమైన పన్ను లేదా దంతం కదలకుండా గట్టిగా పటిష్టంగా ఉంటుంది. అంతేకాకుండా పంటిమీద చీలికలు గాని, రంధ్రాలు, పగుళ్ళు గాని లేకుండా తెల్లగా నునుపుగా ఉంటుంది. అందరి పళ్ళు మరీ తెలుపుగా లేకపోయినా, కొద్ది తేడాతో ఉంటాయి. నల్లగా మాత్రం వుండవు.

పిప్పి పన్ను వ్యాధి సోకిన పంటి భాగం తన సహజ రంగును కోల్పోతుంది. గోధుమరంగుగాని, నలుపురంగుగాని ఏర్పడి



గుర్తించడం ఎలా?

- పంటి నమిలే భాగాల మీద గుండుసూదిని జాగ్రత్తగా జార్చినట్లయితే ఆ సూది సాఫీగా సాగిపోయినట్లయితే ఆ పంటి భాగంలో 'పిప్పి' ప్రారంభం కాలేదని గుర్తించాలి. అలాకాక ఎప్పుడైనా ఆ గుండు సూది ఆగిపోయినట్లయితే అక్కడ పిప్పిపన్ను వ్యాధి ప్రారంభం కానున్నట్లుగా గమనించాలి.
- పన్ను రంగు మారితే పప్పిపన్ను వ్యాధిని ఊహించవచ్చు.
- నోటి దుర్వాసన ఉంటే, ఇతర దంత-నోటి వ్యాధులతో పాటు పిప్పి పన్నును కూడా ఊహించవచ్చు.
- పన్ను 'జివ్వు' మని గుంజుతుంటే, పంటి అరుగుదలతో పాటు 'పిప్పిపన్ను' వ్యాధిని కూడా ఊహించవచ్చు.

పంటి నమిలే భాగంపై పగుళ్ళుగా ఏర్పడడంగాని, చిన్నచిన్న రంధ్రాలుగా ఏర్పడడం గాని జరుగుతుంది. రంధ్రాలలో మనం తినే ఆహార పదార్థాలు ఇరుక్కుపోయి పరిశుభ్రతకు నోచుకోకపోవడం వల్ల అలాంటి ఆహార పదార్థాలు అక్కడ కుళ్ళిపోతాయి. నోటి లోపల అపాయకరమైన బాక్టీరియాల వల్ల, రసాయనిక చర్యలు జరిగి, కొన్ని రకాల వాయువులు వెలువడతాయి. ఈ వాయువులు నీచు వాసనను లేదా ఇతర దుర్వాసనను కలిగిస్తాయి. దానితో పాటు కొన్ని రకాల ఆమ్లాలు కూడా విడుదలవుతాయి. ఈ ఆమ్లాలలో పంటి పైభాగమైన ఎనామిల్ (పింగాణి) పొర కరిగిపోయే గుణాన్ని కలిగి ఉంటుంది. అందుచేత చిన్ని చిన్ని రంధ్రాలు ఏర్పడ్డం, అప్పటికే ఉన్న రంధ్రాలు మరింత పెద్దవి కావడం జరుగుతుంది. జాగ్రత్తగా పరిశీలించకపోతే, మనకు తెలీకుండానే చర్యలన్నీ ఒక దాని తరువాత మరొకటి జరిగిపోతుంటుంది.

ప్రారంభ దశలో మనకు ఎందుకు తెలీదు ?

మన పళ్ళ విషయంలో మనం ఏ మాత్రం అప్రమత్తంగా లేకపోయినా, పిప్పిపన్ను వ్యాధి రాకడను మనం గమనించలేము. మరి పంటికి రంధ్రం పడినా, మొదట మనకు తెలియకపోవడానికి కారణం ఏమిటి? అప్పుడు పంటి నొప్పి ఎందుకు రాదు? అన్న ప్రశ్నలకు సాంకేతికపరమైన కారణం ఉంది.

పంటి అడ్డుకోతను పరిశీలించి చూచినట్లయితే, మనకు మూడు ముఖ్యమైన భాగాలు కనిపిస్తాయి. వాటిల్లో పైన కన్పించేది ఎనామిల్ (పింగాణి) పొర, దానికిందిది 'డెంటిన్ పొర' దాని తరువాతి పొర ఎంతో సున్నితమైన ముఖ్యమైన 'పల్ప్‌పొర'. ఇక్కడ ముఖ్యమైన అసలు విషయం ఏమిటంటే, మనకు కన్పించే మొదటి పొర అయిన పింగాణి పొర (ఎనామిల్)కు నరాల సరఫరాగాని, రక్తనాళాల సరఫరా గాని లేకపోవడం వల్ల, స్పర్శనాడులు, మెదడుకు సమాచారం అందించే పరిస్థితి ఉత్పన్నం కాదు. అందుచేతనే మనం ఆ సమయంలో అశ్రద్ధ చేయడానికి అవకాశాలు కలుగుతాయి. అందుచేత నొప్పివస్తేనే అది 'పిప్పిపన్ను' అని, లేకుంటే ఆరోగ్యవంతమైన పన్ను అని అనుకోకూడదు. మన స్వయం పరిశీలన వల్ల, సంవత్సరానికొకమారు చేయించుకునే దంత వైద్య పరీక్షల వల్ల, ఇలాంటి సమస్యలు బయటపడుతుంటాయి.

పిప్పిపన్ను వ్యాధి వచ్చిన తరువాత దీని వైద్యం కోసం ఖర్చు చేసే సొమ్ము కంటే, సంవత్సరానికొకమారు దంతవైద్య పరీక్షల కోసం అయ్యే ఖర్చు అతి తక్కువ కావడం వల్ల, నొప్పికోసం, సమస్య కోసం ఎదురు చూడకుండా తప్పనిసరిగా దంతవైద్య పరీక్షలు చేయించుకోవడం మంచిది.

వ్యాధి వచ్చినప్పుడు దీని నివారణ కోసం, ఉపశమనం కోసం రకరకాలుగా బాధపడే బదులు వ్యాధి రాకుండా చూసుకోవడమే ఉత్తమమైన మార్గం. మనం పరిశీలించుకోవడం, సంవత్సరానికొకమారు దంతవైద్య పరీక్షలు చేయించుకోవడం, శాస్త్రీయ పద్ధతులలో సరైన దంతధావన విధానాలను పాటించడం, నోటి పరిశుభ్రత విషయంలో జాగ్రత్తలు పాటించడం, పళ్ళకు, దవడలకు వ్యాయామాన్ని కలిగించగల పుష్టికరమైన ఆహార పదార్థాలను ఎంచుకోవడం ద్వారా పిప్పి పన్ను వ్యాధిని మన దగ్గరకు రాకుండా దూరంగా ఉంచవచ్చు.

ముగింపుగా :

పాశ్చాత్య దేశాలలో, పిప్పిపన్ను రావడానికి గల అసలు కారణాలను సర్వే చేయించి, సామాజికపరంగా అనేక చర్యలు తీసుకుంటున్నారు. అధిక శాతం బడ్జెట్టు ఇలాంటి కార్యక్రమాలకు వినియోగించడం వల్ల, పిప్పి పన్ను వ్యాధి తగ్గుముఖం పట్టే పరిస్థితులను కల్పించారు.

కాని మన దేశంలో ఇంకా పిప్పిపన్ను వ్యాధి హెచ్చు స్థాయిలోనే ఉంది. సమాజంలోని అన్ని వర్గాలకు దంత వైద్య సదుపాయాలు అందితే తప్ప, గ్రామీణ ప్రజలకు అతి చేరువలో ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సైతం దంత వైద్య విభాగాలను ప్రారంభిస్తే తప్ప, మన రాష్ట్రానికి సంబంధించి అనేక ఆసుపత్రులలో ఖాళీగా వున్న దంత వైద్యుల పోస్టులను భర్తీ చేస్తే తప్ప పిప్పి పన్ను వ్యాధి వంటి సమస్యను అదుపు చేసే పరిస్థితులు రావు. వైద్యరంగంలో దంత వైద్యరంగానికి కూడా పెద్ద పీట వేస్తే తప్ప పాశ్చాత్యులతో మనం పోటీ పడే పరిస్థితులు ఇప్పట్లో మనకు కన్పించవు.



పుస్తక పరిచయం

భగత్‌సింగ్ రచనలు ఎప్పటికీ ఉత్తేజమే!

భగత్‌సింగ్ రచనలు ఈ నేలపై సామ్రాజ్యవాదం ఉన్నంతవరకూ అవసరమైన రచనలు. భగత్‌సింగ్ గురించి రాసిన, రాసే రచనలక్కూడా ఇదే వర్తిస్తుంది. ఆ రచనలకు కాలపరిమితి, ప్రచురణల సంఖ్యలతో నిమిత్తమేలేదు. ఎన్ని సంస్థలు ఎన్ని ప్రచురణలుగా ప్రచురించినా పునర్ముద్రణకు నోచుకుంటున్న పుస్తకాలలో భగత్‌సింగ్ రచనలు ముఖ్యమైనవి. భగత్‌సింగ్ స్వయంగా మనతో అంటున్నాడా అన్నంత గాఢంగా "నా నెత్తురు వృధా కాదు" అనే టైటిల్‌తో వచ్చిన పుస్తకం మూడవ ముద్రణ ఇటీవల భగత్‌సింగ్ జయంతి సందర్భంగా(సెప్టెంబర్, 28న) విడుదలైంది.



నా నెత్తురు వృధా కాదు
భగత్‌సింగ్ రచనలు,
జనసాహితి ప్రచురణ,
పేజీలు:296, **వెల:**రూ.60/-
ప్రతులకు: ప్రజాశక్తి, విశాలాంధ్ర, మైత్రీ బుక్‌హౌస్‌లు, అన్ని ప్రముఖ పుస్తకకేంద్రాలు.

నేడు పేట్రేగిపోతున్న ప్రపంచీకరణాధిపత్యాలకు, చరిత్ర కాషాయీకరణా కుయత్నాలకు వ్యతిరేకంగా చైతన్యాన్ని అందించాల్సిన కర్తవ్యాన్ని ఈ ప్రచురణ నిర్వర్తించింది. "యువత ఉద్యమాల్లోకి వచ్చి సామ్రాజ్యవాదుల్ని, వారి ఒప్పందాల్నీ ఎండగట్టడానికీ, రద్దు చేయించడానికి ఈనాడు భగత్‌సింగ్ ఎంతో స్ఫూర్తినిస్తాడు. అందువల్ల భగత్‌సింగ్ ఈనాడు మరింత అవసరం" అని దీన్ని ప్రచురించిన జనసాహితి తన మూడవకూర్పు ముందుమాటలో పేర్కొన్నారు.

"నా నెత్తురు వృధా కాదు" గ్రంథం చదివినవారికి భగత్‌సింగ్ గురించిన సమాచారం మాత్రమే కాదు, ఆ "మహావిస్ఫోటనం" ఎన్నో కోణాలనుంచి, మరెన్నో విశ్లేషణల్లోంచి కనబడతాడు. చాలామంది భగత్‌సింగ్ అనగానే తెల్లదొరల గుండెలపై పేలిన బాంబు అనుకుంటారు. తీవ్రవాద పంథానెంచుకున్న టెర్రరిస్టుగా మరికొందరనుకుంటారు. సంఘపరివారపు రామదండు తమ కాషాయంలోకి భగత్‌సింగ్ ధీరత్వాన్ని హైజాక్ చేద్దామన్నారు. ఇటువంటి కుయత్నాలకు, వర్ణనలకు తగు జవాబిస్తుందీ పుస్తకం. భగత్‌సింగ్ తన చివరిఘడియల్లో, క్షణాల్లో లెనిన్‌ను చదవడానికి చూపించిన ఆసక్తి, విప్లవం పట్ల వ్యక్తంచేసిన భావాలు, భగత్‌సింగ్‌ను పరిపూర్ణమైన విప్లవకారుడిగా నిరూపిస్తాయి. జైలర్ వచ్చి ఉరిశిక్షకు సమయం అయ్యింది, బయలుదేరుతారా అనడిగితే, లెనిన్ రాసిన రాజకీయసైద్ధాంతిక గ్రంథం "ఏం చెయ్యాలి?" చదువుతున్న భగత్‌సింగ్, "ఉష్షా...డిస్టర్బ్ చేయకండి. ఒక విప్లవకారుడు మరో విప్లకారుడితో సంభాషిస్తున్నాడు" అంటాడు. చదువుతున్న పుస్తకాన్ని తెరిచే బోర్లాపెట్టివుంచి, "పదండి వెళ్దాం" అంటూ ఉరికంభానికి బయలుదేరుతాడు. ఈ ఉద్వేగఘట్టం గుర్తొచ్చేలా ఎన్నో అంశాలు ఇందులో పొందుపర్చారు. "భగత్‌సింగ్ బతికేవుంటే భారతదేశ చరిత్ర వేరేవిధంగా రాయాల్సి వచ్చేదేమో" ననిపించేలా పాఠకులు ఒక నిర్ధారణకు రావడానికి విలువైన డాక్యుమెంటరీ సమాచారాన్ని, దానికి తగు విశ్లేషణను జోడించి ఈ పుస్తకంలో పొందుపర్చారు. భగత్‌సింగ్ రచనలు: సందేశాలు, అసెంబ్లీ బాంబుకేసు, తొలితరం విప్లవకారులపై భగత్‌సింగ్ వ్యాసాలు, ఆర్థిక, సాంఘిక, రాజకీయ సమస్యలపై భగత్‌సింగ్ స్పందన, భగత్‌సింగ్ లేఖలు...ఇలా ఆయన రచనలన్నింటినీ విభజించి ప్రచురించారు. ఆనాటి, నేటి వ్యాసకర్తలు భగత్‌సింగ్‌పై రాసిన రచనలు కూడా ఇందులో ఉన్నాయి. ఈ రచనల ద్వారా భగత్ రాజకీయ, విప్లవ అవగాహన గాఢత అర్థమవుతుంది. ఆయనలోని విప్లవ స్పష్టతకు ఎంత ముగ్ధులమవుతామో, ఆయన తన సమకాలీన సాహిత్య, సాంస్కృతికాంశాలపై రచనలు చూస్తే 17 ఏళ్ళ వయస్సులో అంత విశేష కృషికి అచ్చెరువొందుతాం.

ఈ మూడవ ముద్రణలో మరికొంత విలువైన సమాచారం అదనంగా అందించారు. భగత్‌సింగ్ చివరిరోజుల గురించి, శిక్కుమతాచారాన్ని అవలంబించాడనీ, అందుకే జుట్టు అంతగా పెంచుకున్నాడని, నులకమంచంలో జుట్టుముడివేసుకుని ఉన్న ఫొటో కూడా ఉందని చెప్పే రకరకాల వాదనలకు, నాటి "బ్లిట్జ్" పత్రిక రాతలకు ధీటైన జవాబుగా వాస్తవాలను అందిస్తూ ప్రొ॥జగ్‌మోహన్ సింగ్ రాసిన వ్యాసం ప్రచురించారు. ఆనాటి బ్రిటీష్‌వారి పన్నాగపు విభజించు-పాలించు ఎత్తుగడల ఉచ్చులో పడిన జ్ఞానీ నాహర్‌సింగ్ అనే రచయిత రాసిన "జైల్ కే పత్ర్" వల్ల ఈ నిందాప్రచారం జరిగిందని జగ్‌మోహన్ అంటారు. 1927లో అరెస్టు చేసి చిత్రహింసలకు గురిచేస్తున్నప్పటి కస్టడీలోని భగత్ ఫొటోని తప్పుగా ప్రెజెంట్ చేస్తున్నారని ఆయనంటున్నారు. ఉరిశిక్షకు ముందుంచే కండెమ్డ్ సెల్ ఖైదీకి చినిగిన బట్టలు, నులకమంచం ఉండవని కూడా ఊహించలేని వారినుంచి ఆ ఫొటోనలా ఉపయోగించారని జగ్‌మోహన్‌సింగ్ గట్టిగా తన వ్యాసంలో వాదించారు. ఇలాంటి అనేక ఆధారాలతో కూడిన వివరాలతో, అంచనాలతో భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌లను మరోసారి తెలుగు ప్రజలముందుంచిన నా నెత్తురు వృధా కాదు పుస్తకాన్ని ఒక దీక్షతో అందించిన సంపాదకులు నిర్మలానందగారి కృషి ఎనలేనిది.

-శంకర్

శ్రీకారం

గగనం
కవితా సంపుటి
రచన : వరిగొండ కాంతారావు; **వెల:**రు.60/-;
ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

స్వర్ణభారతి (పద్యకవిత)
రచన : పురిజాల నారాయణమూర్తి;
ప్రతులకు : పురిజాల సుధాకర్, ప్లాట్ నెం.90, శ్రీరామ్‌నగర్, నరసన్నపేట, శ్రీకాకుళం జిల్లా

మన మంగళగిరి
రచన : మాదిరాజు గోవర్ధనరావు;
వెల : రు.100/-
ప్రతులకు : పట్టణ వికాస మండలి, మంగళగిరి, 1-1404, పెదకోనేటివీధి, మంగళగిరి

రాకెట్ల వీరన్న

మైసూర్ ప్యాలెస్‌లో ఎన్నెన్ని అందాలో...


ప్యాలెస్‌లో వెండి, దంతపు తలుపులు

ప్రపంచ టూరిజంలో మైసూర్ ఒక విశిష్టపర్యాటక ప్రాంతంగా గుర్తింపు పొందిందని ప్రత్యేకంగా చెప్పుకోనక్కర్లేదు. భారతదేశ ప్రసిద్ధ పర్యాటక స్థానాల్లో తాజ్‌మహల్‌కి ఉన్నంతటి ప్రాముఖ్యత మైసూరుది కూడా! మైసూర్‌లోని ప్యాలెస్ గురించి ఎంత వర్ణించి రాసినా స్వయంగా చూసినదానికి సరిసమానం కాదు. 14వ శతాబ్దంలో మహారాజులు నివశించిన ఈ భవ్య భవనాన్ని 1638లో రణధీర కంఠీరవ నరసరాజ వడియార్ పునర్నిర్మాణం చేశారు.

ఇప్పుడున్న ప్యాలెస్‌లో యూరోపియన్ పెయింటర్స్ చేత అద్భుతమైన పెయింటింగ్స్ వేయించారు. వందల సంవత్సరాల క్రితం వేసిన పెయింటింగ్స్ ఇప్పటికీ చెక్కు చెదరలేదు. దసరా హాల్, ఓపెన్ గ్యాలరీ, ప్యాలెస్ దక్షిణ, ఉత్తర భాగాలలో ఎన్నో చిత్రాలు వేయించారు. అవి చూపరులను మంత్రముగ్ధుల్ని చేస్తాయి. ఆశ్చర్యాన్ని, ఆనందాల్ని కలిగిస్తూ అడుగు ముందుకు వేయనీయవు. ప్యాలెస్‌లోని ఉత్తర భాగంలో వివిధ రకాల ఆఫీసులు, గ్రంథాలయం తదితరాలు ఉన్నాయి. దక్షిణ భాగంలోని రూములన్నీ మహారాజావారు తన విడిది కోసం వినియోగించు కుంటుండేవారు. వీటిలో చాలా ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కలిగించేది అంబవిలాస. 60 చదరపు అడుగుల విస్తీర్ణంలో యూరోపియన్ స్టైల్‌లో ఉన్న ఈ గది అద్భుతం, అమోఘం. చెక్క చట్రం(వుడెన్ రైలింగ్)తో మహారాజావారి సింహాసనం ఉన్న ఈ హాలులో కూడా ఎన్నో చిత్రాలు ఉన్నాయి. ఇక్కడ ఎన్నో వెండి, దంతపు డిజైన్లతో ఉన్న తలుపులు దర్వాజాలున్నాయి. రాజావారి పడకగది, భోజనగదులు, అప్పట్లో వాడిన డైనింగ్ టేబుల్, స్పూన్లు, ప్లేట్లు, గ్లాసులు తదితర పాత్రలు, వారు వాడిన వస్త్రాలు, అద్భుతమైన డిజైన్లతో చేయబడిన మంచాలు చూడవచ్చు.

కళ్యాణమంటపం :

గోల్డెన్ హౌదా నుండి ముందుకు వెళితే ఈ కళ్యాణమంటపం వస్తుంది. ఈ కళ్యాణ మండపంలోని నాలుగు గోడలపై ఆస్థాన ఆర్టిస్టులు కె.కేశవయ్య, ఎస్ఎన్ స్వామి, వై నాగరాజు, ఎస్ శంకరరాజు, ఎస్ఆర్ అయ్యంగార్, వై సుబ్రమణ్య రాజులు వేసిన అద్భుత చిత్రాలలో దసరా ఉత్సవాల సంబరాలను చూస్తాము. 26 రకాల చిత్రాలు వేశారు. 1934-1945 సంవత్సరాల మధ్య ఇక్కడ జరిగిన దసరా ఉత్సవాల ఫొటోలు కూడా ఉన్నాయి.

పోర్‌ట్రెయిట్ గ్యాలరీ

కళ్యాణమండపంలో దక్షిణభాగంలో ఉన్న ఈ గ్యాలరీ. చాలా విలువైన పెయింటింగ్‌లు, మహారాజుల ఫ్యామిలీ ఫొటోగ్రాఫ్‌లు ఉన్నాయి. అక్కడ రెండు అతిపెద్ద ఫొటోలు ఉన్నాయి. అవి దాదాపు వంద సంవత్సరాల కిందటివి. వాటిలో ఒకటి క్రిష్ణరాజ వడియార్-4, ఆయన చిన తమ్ముడు కాంతివర నరసింహరాజ వడియార్‌ది. వారి చెల్లెలు రాణి జయలక్ష్మిది. మోడరన్ మైసూర్ ప్యాలెస్‌కు అంకురార్పణ గావించినది ఈవిడే. వీరిద్దరి ఫొటోలు ఇక్కడ ఉన్నాయి. వీటిని డెల్ట్ షో & కంపెనీ 1897లో తయారు చేసింది.

ఫర్నిచర్ రూం :

కళ్యాణ మండపం నుండి ఉత్తర భాగం వైపు అడుగులేస్తే ఇంకో గ్యాలరీ వస్తుంది. ఇక్కడ మూడు రూములు ఉన్నాయి. ఒక రూములో ఫర్నిచర్, రెండో రూములో రెండు వెండి కుర్చీలున్నాయి. వీటిని ముఖ్యమైన సందర్భాల్లో మాత్రమే ఉపయోగించేవారు. వీటిని బార్టన్‌సన్ & కంపెనీ, బెంగుళూరు వారు తయారుజేశారు. ఏనుగుల ప్రవేశద్వారాన్ని (ఆనెబాగిలి), టిఆర్ తాప్‌కర్ & సన్స్, మద్రాసువారు తయారుచేశారు. మరో రూములో మహారాజా, అతని సోదరుడు, కోడలు బంగారు సింహాసనంపై కూర్చున్న పెయింటింగ్ ఉన్నాయి.

ట్రోఫీలు :

మధ్యలో ఉన్న రూములో అప్పటి జయభాను రాజేంద్రవడియార్ గెలిచిన ట్రోఫీలను భద్రపరిచారు. ఇంటర్నేషనల్ స్థాయిలో జరిగిన టాక్సీ డ్రైవింగ్‌లో, పులులు, చిరుతలు, ఏనుగులను వేటాడడంలో గెలిచిన షీల్డులను ఇక్కడ ఉంచారు.

ఆయుధశాల :

ఈ గ్యాలరీ నుండి కొంచెం ముందుకు వెళితే ఆయుధశాల వస్తుంది. వందల సంవత్సరాల క్రితం నాటి ఆయుధాలు ఇక్కడ భద్రపరిచారు. ఇక్కడ 725 రకాల ఆయుధాలు భద్రపరిచారు. గత శతాబ్దిలో ఈ ఆయుధాల సంఖ్య 1300కు పెరిగింది. క్రిష్ణరాజ వడియార్-3 వీటన్నింటినీ పోగుచేసి, ఒక్కోదానికి ఒక్కో షెల్ఫ్‌ను ఏర్పాటుచేసి, వాటికి మెటాలిక్ లేబుల్‌ని అతికించి, సీరియల్ నెంబరు కూడా వేయించారు. ప్రతిఒక్కదానిపైనా ఆయన పేరు శ్రీకష్ణ అని కూడా వేయించాడు. ఇక్కడ ఆనాటి రాజులు యుద్ధాల్లో వాడిన కత్తి, డాలు, బల్లెం, బాట్లు, శిరస్త్రాణాలు, కవచాలు, వారి వస్త్రాలు మొదలగునవన్నీ భద్రపరిచారు.

ఇంకా దర్బార్ హాల్, గొంబితొట్టి(డాల్స్ పెవిలియన్) లాంటి అద్భుత కట్టడాలు అనేకం ఉన్నాయి. ఇక్కడకు వెళ్ళినవారు ఏదో ఒకపూట అలాఅలా తిరిగేసి వచ్చేద్దాం అనుకునేటటువంటి పర్యాటక ప్రాంతం కాదు. సౌందర్యవంతమైన, ఆహ్లాదకరమైన ఈ మైసూరు అద్భుత రాజభవనాన్ని తగినంత సమయాన్ని కేటాయించి తనివితీరా చూడాల్సిందే.

రాజా రవివర్మ వేసిన క్రిష్ణరాజ వడియార్, అతని సోదరుల చిత్రం

అంబవిలాస్

కళ కోసమే జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి. అర్ధాంగి మరణాన్ని కూడా తియ్యని జ్ఞాపకంగా మలుచుకున్నవాడు. ఆమె ఊహాల్లోనే కళను ఆరాధిస్తున్న తపస్వి. జీవితమంటే సౌఖ్యం కాదని జీవనమంటే మాధుర్యమని గడిపే ఈ కళాకారుడు బహు చిత్రకారుడు.

పేరు లేనోడు ఈ శిల్పి

నాంబత్తుల రాంబాబు

"ఈ శిల్పులెవ్వరు? ఈ కూలీలు ఎవ్వరు? పేరు లేనోల్లు ఘనకీర్తి కలవాళ్లు" అన్న ప్రజాకవి మాటలు అక్షరసత్యం. అక్షరాలా నిజం చేస్తాయి ఈ కళకారుడ్ని చూస్తే. వెదురు పుల్లలతో అద్భుత కళాఖండాలను సృష్టిస్తున్న అతడి పేరు మారియప్పన్ లోక్‌నాథం. మేదర్లు వదిలి పారవేసిన వెదురు బొంగులు తను సృష్టించే కళాఖండాలకు ముడిసరుకు. ఈ కళాకారుడు రూపొందించే నాలుగు అంతస్తుల పడవలుగాని, మూడు, నాలుగు అంతస్తుల ఇండ్ల నమూనాలుగాని, తాను చూసిన, తెలిసిన విషయాలతో వాటిని నిర్మిస్తాడు. తన పేరుకు తగ్గట్టుగానే భారతదేశంలోని పలు ప్రాంతాలను చుట్టివచ్చి లోకసంచారి ఈ కళాకారుడు. తన జీవితం అంతా ఈ కళతోనే ముడిపడి ఉన్నదని చెప్పే లోక్‌నాథం నేడు ఒంటరి జీవి. పుట్టింది ఎక్కడో తమిళనాట. పెరిగింది, ఈ కళతో పరిచయం అయ్యింది ఆంధ్ర ప్రాంతంలోనే. పన్నెండేళ్ళ చిరుప్రాయంలో ఆకతాయితనంగా ఇంటిలోంచి పారిపోయి వచ్చిన లోక్‌నాథం నెల్లూరులో ఒక గిరిజన తెగ ఇంట ఆశ్రయం పొందారు. అప్పటికే తనలో చిగురుతొడుగుతున్న ఈ కళ మొగ్గతొడిగింది. తన చిన్న చిన్న ఊహాలకు వెదురు పుల్లలతోనే ఆశాసౌధాలు నిర్మించడం మొదలుపెట్టాడు. ఊహాలతో ఎదిగిన తన ఆలోచనలు వృత్తిగా మలచుకొని జీవనం సాగిస్తున్నాడు. కేవలం మూడు పరికరాలతో అద్భుత కళాఖండాలు సృష్టిస్తున్న లోక్‌నాథం తమిళనాడు లోని నీలగిరి జిల్లా ఊటీలో 1955లో జన్మించాడు తనకు ఆశ్రయం ఇచ్చిన, తన పెరుగుదలకు తోడ్పడిన ఆ గిరిజన తెగ అమ్మాయినే వివాహం చేసుకున్నాడు లోక్‌నాథం. తన సహవాసంలో ఆమె కూడా ఈ కళకు ఆకర్షితురాలై నెల్లూరు పరిసర ప్రాంతాలలో పడవలమ్మగా ప్రాచుర్యం పొందిన తన భార్య పేరు సీతారావమ్మ అని లోక్‌నాథం ప్రజాశక్తికి చెప్పారు. తాను తయారుచేసిన కళాఖండాలను మార్కెట్‌లో విక్రయిస్తూ పడవలమ్మగా ఎందరో కళాహృదాయాల్లో పేరు సంపాదించుకుందని తన భార్యను గుర్తుచేసుకున్నారు. తన భార్యకు వచ్చిన పడవలమ్మ పేరు తాను ఎక్కడకు వెళ్ళినా పడవలయ్యగానే సుపరిచితుడనేని లోక్‌నాథం చెబుతారు. భార్య మృతితో కలత చెందిన లోక్‌నాథం

- వృత్తి: పడవలు, పలు అంతస్థు భవనాల తయారీ
- చదువు: ప్రాథమిక విద్య
- ప్రత్యేకత: ఎంతో ఎత్తున్న పడవల్ని, భవానాలను మీనియేచర్స్‌గా రూపొందించడం
- పేరు: మారియప్పన్ లోక్‌నాథం
- ఆవాసం: వెళ్ళిన ఊళ్ళో నీడనిచ్చే ప్రదేశం(చోటు)
- ఆశయం: తాను తయారుచేసిన బొమ్మలు అందరి ఇళ్ళల్లో అలంకరించుకోవడం
- ఆశ: కళను కళాత్మకంగా పోషించడం
- ఆహారం: ఒక పూట భోజనం, సాత్వికాహారం
- తెలిసిన భాషలు: తెలుగు, తమిళం, కన్నడం, హిందీ
- తెలిసిన తత్వం: మంచితనం... మన్నన
- ఇష్టమైన ప్రదేశం: తమిళనాడు
- దూరం పెట్టినవి: మద్యం, మాంసాహారం
- దగ్గరైనవి: బీడి కాల్చటం, టీ తాగడం

దీపావళి వెలుగుపూలు

చిత్రం : వెల్లటూరి పూర్ణానంద శర్మ, గుంటూరు

దేశంలోని వివిధ ప్రాంతాలను సందర్శిస్తూ తను చేసిన కళాఖండాలను అమ్మకాలు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తను చేస్తున్న వృత్తిని చాలా మంది వ్యాపార రీత్యా విక్రయించడానికి, వారు ఎక్కువ ధర రాబట్టుకోవడానికి చేసిన ప్రయత్నాలను లోక్‌నాథం సున్నితంగానే తిరస్కరించిన విషయాన్ని ప్రజాశక్తి వద్ద ప్రస్తావించారు. నీవు బొమ్మలు తయారుచేయి, నీ డబ్బులు నీకు చెల్లిస్తాము, ఇవి మాకే అమ్మాలి అన్న వ్యాపారస్తుల వాదనల్ని కాదన్నారు లోక్‌నాథం. తాను తయారుచేసిన బొమ్మలకు ఎంత ఖర్చు అవుతుందో అంతే తప్ప ఎక్కువ సొమ్ము ఆశించకుండా తానే అమ్ముతానని అంటాడు ఈ కళాకారుడు. ఏ ఊరు వెళ్లినా ఆ ప్రాంత వాసుల్ని దోచే ఈ బొమ్మలు రోజుకు రెండు లేదా మూడు మాత్రమే లోక్‌నాథం తయారుచేస్తాడు. తయారయిన బొమ్మలను చూసి ముగ్ధులయ్యేవారు. ఎక్కువ ధర చెల్లిస్తామన్నా అమ్మని మనస్తత్వం లోక్‌నాథంది. బొమ్మలు తయారువు తుండగానే చూసి కావాలని చెప్పినవారికి మాత్రమే అమ్మడం ఈయన ప్రత్యేకత. వాగ్దానం అయిపోయిన బొమ్మ మరొకరు ఎక్కువ ధర చెల్లిస్తామన్నా తాను అమ్మను అంటాడు లోక్‌నాథం. అందుబాటులో దొరికే వనరులతో ఎంత మంచి కళాకృతుల్ని తయారు చేయవచ్చో తెలిపే ఈ కళాకారుని ఆలోచనలను భావితరాలకు అందించాల్సిన అవసరం వుంది. ఒక కళకు వారసత్వం కాని, శిక్షణకాని ఉంటేనే అది వికసిస్తుంది. వారసులు లేని లోక్‌నాథం విద్యను శిక్షణ ద్వారా ఇతరులకు అందించే ప్రయత్నం చేస్తే బాగుంటుంది. ✤

పడవను తయారుచేస్తున్న లోక్‌నాథం


లోక్‌నాథం తయారుచేసిన పడవ

ఆంధ్రమాత ఒడిలో 'అమరజీవి'



ఆంధ్రుల అనాది వాంఛకు
పునాది రాయిలా
ఆంధ్ర మహాభ్యుదయానికి
ప్రాణం పోసిన త్యాగజీవిగా
భాషా ప్రాతిపదికన నిలిచిన తొలి
శిఖరంలా
ఆంధ్రమాత ఒడిలో అమరజీవి శాశ్వతం
ఐక్యత కోసం సఖ్యత కూర్చగా
గాంధేయవాదం గొంతున నింపి
గుండెనెగసిన భాషావేశం
ఆశయ జ్వాలాభిషేకంతో వెలుగు పోసుకోవాలని
కలలు గన్న తెలుగు గడ్డపు ముద్దు బిడ్డడు
నిరాహార దీక్షతో ఉద్యమానికి ఊపిరొసగి
నీరసించే తనువుతోనే నిరసించే ఉద్యమాన
నిరాహార శక్తే పోరాటపు ఆరాటమై
ఆత్మార్పణ 'సమైక్య'గా జన్మెత్తి
ఆంధ్రరాష్ట్రంగా శిరసెత్తి
అమరుడై దివ్వెలా వాడవాడన 'ప్రకాశి'ంచాడు
ప్రాంతీయ భేదాలకు తావులేని స్వర్ణమయి ఆంధ్రసీమ
సమైక్యతా కుసుమాన సంస్కృతీ సౌరభాలు
విరజిమ్మిన ఆంధ్రతపై ప్రతి పౌరుడు హక్కుదారే
అమరజీవి ఆశయం సమైక్యం
సమైక్యం అన్నింటా అతిముఖ్యం
అందుకే...
ఆంధ్రమాత ఒడిలో అమరజీవి ఆశయాలు శాశ్వతం కావాలి.

- చందలూరి నారాయణరావు

లంచం పద్ధతి పోవాలోయ్

పల్లవి : పోవాలోయ్! లంచం పద్ధతి పోవాలోయ్!!
రావాలోయ్! నీతికి కాలం రావాలోయ్!!
ఈ జగాన పుట్టుటకు ఆయాకు లంచం
ఆఫీసులో పుట్టుక పత్రానికి లంచం
ఆఫీసులో చావు పత్రానికీ లంచం
రెవెన్యూ ఆఫీసున ప్రతిపనికీ లంచం ॥పోవాలోయ్॥
ఉద్యోగం రావాలంటే మహాలంచం
ఆడపిల్ల పెళ్ళికి కట్నమనే లంచం
బిల్లులు పాస్ కావటాన్కి పర్సంటేజీ
కంట్రాక్టు రావటాన్కి ఇవ్వాలి లంచం ॥పోవాలోయ్॥
పార్టీ టికెట్టు రావడానికి లంచం
మంత్రి పదవికి ఎగబాకటానికి లంచం
ప్రజలు నిత్యావసరాల నిమిత్తం-నేడు
ఆఫీసు, ఆస్పత్రుల్లో, ఆలయాల్లో
అడుగడుగునా ఇవ్వాల్సి వచ్చిన లంచం ॥పోవాలోయ్॥
మహాలంచాలిచ్చి పదవుల కొచ్చినోళ్ళు
మరీ లంచాలిచ్చి అధికారులయినోళ్ళు
తిరిగి - నోళ్ళు విప్పి - లంచాలు మేయకుండ
మనమంతా వేయాలి నిఘా! నిరంతరం!! ॥పోవాలోయ్॥
లంచం ఇచ్చిపుచ్చుకోవటాలు నేరం
లంచం, అవినీతి అక్రమ పద్ధతులురా
రెండూ సామాజిక, మానసిక జబ్బులుర
ఈ పదాలు పోవాలి నిఘంటువుల్లోంచి
ఈ ఆలోచనలు పోవాలి ప్రతి మదిలోంచి ॥పోవాలోయ్॥
పాటించాలి ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ
చేయాలి ఎవరి పని వారు సమయపాలనతో
లంచం లేని జగతి సౌకర్యాల గని
అవినీతి లేని జగతి సంతోషాల ఖని ॥పోవాలోయ్॥

- డా॥ నాగినేని బాస్కరరావు

నవంబర్ మొదటి వారం "అవినీతి వ్యతిరేక వారం"

న్యాయసలహాలు

జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

పుట్టిన తేదీ మార్పు కుదరదా?

నా పుట్టిన తేదీ పాఠశాలలో చేరినపుడు (1వ తరగతిలో) తప్పు పడినది. పాఠశాల రికార్డులో దిద్దుబాటు కూడా జరిగినది. నా పుట్టిన తేదీ 1-9-1963గా నమోదు చేశారు. మా అన్నయ్య పుట్టిన తేదీ కూడా 1-9-1963గా నమోదు చేశారు. మా అన్నయ్య స్టడీ, పుట్టిన తేదీ సర్టిఫికెట్ కూడా మా వద్ద వున్నాయి. నా ఎస్.ఎస్.సి. సర్టిఫికెట్‌లో కూడా 1-9-1963గా నమోదైంది. పురోహితులు రాసిన జనన పత్రిక మా వద్ద ఉన్నది. అందులో 1-9-1967గా పుట్టిన తేదీ రాసి ఉంది. మా అన్నయ్యకు నాకు నాలుగు సంవత్సరాలు తేడా అని మా తల్లిదండ్రులు చెబుతున్నారు. నేను టీచర్‌గా పని చేయుచున్నాను. నాలుగు సంవత్సరాలు సర్వీసు నష్టపోతున్నాను. ఒకసారి పుట్టిన తేదీ నమోదైతే మార్చడం కుదరదని అంటున్నారు. పై ఆధారాల ప్రకారం కోర్టులో కేసు వేస్తే న్యాయం పొందవచ్చా? లేదా?

- ఆర్.టి., విజయనగరం

ప్రభుత్వ సర్వీసులో ఉన్నవారు డేటాఫ్ బర్త్ మార్పు కోరుకునేట్లయితే, తగిన ఆధారాలతో సర్వీసులో చేరిన ఒక సంవత్సరం లోపే మార్పులకు అవకాశం ఉంటుంది.

తండ్రి ఆస్థి-కూతుళ్ళకు వాటా

మాది ప.గో. జిల్లా ఏలూరు గ్రామం. నా పేరు శ్రీలక్ష్మి (38). నాకు 1991లో పెళ్ళి అయ్యింది. నా భర్త ప్రైవేట్ ఉద్యోగం చేస్తారు. రు.2,500 జీతం వస్తుంది. వారి పుట్టిన ఊరు భీమవరం దగ్గర ఉండి. నాకు అమ్మ నాన్న ఇద్దరు చనిపోయారు. మా నాన్న నాకు పెళ్ళికాకముందు 10 సంవత్సరాల క్రితం చనిపోయారు. మా అమ్మ రెండు సంవత్సరాల క్రితం చనిపోయారు. నాకు ఇద్దరు తమ్ముళ్ళు. నేను ఒక్కత్తే కూతురుని. మా అమ్మ మా నాన్నగారు చనిపోయినప్పటి నుంచి నా ఇద్దరు తమ్ముళ్ళని నేను పెంచి పెద్ద చేసినాము. నాలుగు సంవత్సరాల క్రితం ఇద్దరికీ పెళ్ళిళ్ళు కూడా చేశాము. మాకు ఉండిలో సొంత ఇల్లు, 20 లక్షల ఖరీదు చేసే ఆస్తి ఉంది. మా అమ్మగారు ఉన్నంత కాలం ఆస్తిలో వాటా నాకు కూడా ఇస్తానని అన్నారు. నా తమ్ముళ్ళు ఇద్దరు నేను చెప్పినట్లే వింటారు అని అనుకున్నాను. కాని నాకు ఆస్తిలో వాటా ఇవ్వనని చెప్పారు. నాది మధ్యతరగతి కుటుంబం చిన్న జీతం. నాకు ఆస్తి ఏమీ లేదు. మాది పెద్దలు కుదిర్చిన పెళ్ళే. నాకు ఆస్తిలో వాటా వస్తుందా? రాదా? నేను ఏ రకంగా ప్రొసీడ్ అవ్వాలి. అసలు ఆస్తిలో వాటా నేను ఆశించవచ్చా లేదా నాకు హక్కు ఉన్నదా లేదా అది మా తండ్రి గారి ఆస్తి నాకు కూడా హక్కు ఉందా లేదా తెలుపగలరు. నేను లీగల్‌గా వెళ్ళాలంటే తక్కువ ఖర్చుయ్యేట్లు ఏ రకంగా ప్రొసీడ్ అవ్వాలో తెలుపగలరు. ఎందుకంటే తక్కువ జీతంతో నా భర్త ఇద్దరు పిల్లలు మా అత్తగారు అందరం మెయిన్‌టెయిన్ అవ్వాల్సి వస్తుంది. లీగల్‌గా ప్రొసీడ్ అవ్వాలంటే నేను అవ్వాలా లేక మా పిల్లల పేరున ప్రొసీడ్ అవ్వాలా తెలుపవసిందిగా కోరుతున్నాను.

- జె.శ్రీలక్ష్మి, ఏలూరు.

శ్రీలక్ష్మిగారు మీ నాన్నగారి ఆస్తిలో మీ తమ్ముళతో పాటు మీరు వారసులవుతారు. ఆయనగారి ఆస్థిలో మీకు మీ తమ్ముళ్ళతో సరియైన భాగం పొందే హక్కు ఉన్నది. మీ వద్దనే పెరిగి పెద్దవారయ్యారంటున్నారు. వారికింకోసారి మీ బంధువుల సమక్షంలో పెద్దల సహకారంతో చెప్పించి చూడండి. వారు వినని పక్షంలో మీరు కోర్టునాశ్రయించాల్సి ఉంటుంది. మీకు న్యాయవాదిని పెట్టుకునే స్థోమత లేకుంటే మీ జిల్లా కోర్టులోగాని, మీ దగ్గరలోని కోర్టు ఆవరణలోగాని "లీగల్ సర్వీసెస్ అథారిటీ" ఉంటుంది. అక్కడ సంప్రదించి మీ అనహాయతను తెలియజేయండి. వారే మీకు న్యాయవాదిని ఏర్పాటు చేస్తారు. మీ ఆస్థి వున్న చోటే మీరు దావా వేయాలి. మీరు తప్పకుండా మీ భాగం పొందగలుగుతారు.

నా ఎస్టీ కోటాలో నా భార్యకు ఉద్యోగం వస్తుందా?

నేను ఎస్.టి. కులానికి చెందినవాడిని. నా భార్య ఎస్.సి.కి చెందినవారు. నా భార్య ఎస్.ఎస్.సి., ఎ.ఎన్.ఎమ్. చదివినారు. మాది కులాంతర వివాహం. మాకు ఇద్దరు పిల్లలు. నేను ఏమీ చదవలేదు. నా ఎస్టి కోటాలో నుండి ఆవిడకు ఉద్యోగం వేయించాలంటే ఎవర్ని సంప్రదించాలి. ఏం చేయాలో తగిన సలహా చెప్పగలరు.

- ఎస్.శ్రీనివాసరావు, చల్లపల్లి, కృష్ణాజిల్లా

జన్మతా ఏ కులంలో పుడితే ఆ కులమే వర్తిస్తుంది. మారినా కులం వర్తించదు. మీ పిల్లలకు మీ కులం వర్తిస్తుంది. కాని భార్యకు వర్తించదు.

హ్యాపీ బర్త్‌డే

(7-11-2004నుండి
13-11-2004వరకు)

వినయ్‌కుమార్
నవంబర్-10
సుజాత-రమణయ్య
దొండవారిగూడెం-నల్లగొండ

అభిలాష్
7సం॥, 10.11.1997
రమాదేవి-ఆదెయ్య
లాలాపేట-సికింద్రాబాద్

ఎస్‌కె. నాగూర్‌బాబు
1సం॥, 10.11.2003
నబీనా-రహీం
పొదిలి-ప్రకాశం

లక్ష్మి
7సం॥, 11.11.1997
ఆదిలక్ష్మి-నరసింహారావు
రాగోలు-శ్రీకాకుళం

శ్రీశ్వేత(చిన్నారి)
10సం॥, 12.11.1994
నవోదయ-రమణ
భద్రాచలం-ఖమ్మం

విజయసాయికృష్ణవంశీ
4సం॥, 13.11.2000
మంగ-రాజు
కాకినాడ-తూ॥గో

కుమారకృష్ణసాయి రాజు
1సం॥, 13.11.2003
రజని- రాజేష్
కంచరపాలెం-విశాఖ

చరిష్మాశ్రీజా
1సం॥, 13.11.2003
రోజారాణి-విమలశంకర్‌దాస్
అరిలోవ-విశాఖ

కోమలిరాయ్
3సం॥, నవంబర్-2001
స్వప్న-నాగేశ్వరరావు
కంచికచర్ల-కృష్ణా

సాయివిక్రాంత్-చాందిని
కళావతి-సత్యనారాయణ
మధిర-ఖమ్మం

వాసు
కుమారి-రామారావు
ములగాడ-విశాఖ

జైనబ్‌బేగం
1సం॥,నవంబర్2003
జబీనాబేగం-అఫ్జల్‌బేగ్
విజయవాడ-కృష్ణా

శ్రావణి
1సం॥, నవంబర్-2003
అనిత-వెంకన్న
నకిరేకల్-నల్లగొండ

శరత్‌కుమార్‌రెడ్డి
8సం॥, నవంబర్-1996
పుష్ప-వెంకటరెడ్డి
ఉప్పిల్ల-నల్లగొండ

చంద్రకాంతలు

కావలసిన వస్తువులు :

పెసలు	:	ఒక కేజీ
బెల్లం	:	అర కేజీ
మంచినూనె	:	పావు కేజీ
నెయ్యి	:	100 గ్రా.
యాలకులు	:	ఐదు
జీడిపప్పు	:	50 గ్రా.

తయారుచేసే విధానం:

పెసలను నాలుగైదు గంటలు నానబెట్టి ఇడ్లీ పిండిలా రుబ్బు కోవాలి. ఇడ్లీ పాత్రలో గానీ ఏదన్నా గుడ్డకట్టిన గిన్నెలోగానీ కుడుముల్లా ఉడికించాలి. ఆ పెసర కుడుముల్ని చిదిమి పొడిలా చేసుకోవాలి. బెల్లం లేతపాకం పట్టి, దానిలో యాలకులపొడి, నెయ్యి వేయాలి. అలా సిద్ధంచేసిన బెల్లపుపాకంలో పెసర కుడుములపొడిని వేసి బాగా కలియబెట్టాలి. ఆ మిశ్రమాన్ని చల్లారాక పీటపై గాని లేదా పాలిథిన్ పేపర్‌పైగాని ఒత్తుతూ సర్దాలి. దానిని మనకిష్టమైన ఆకారంలో ముక్కలు చేయాలి. ఆ ముక్కల మీద జీడిపప్పు పలుకుల్ని అంటించాలి. (జీడిపప్పు తప్పనిసరికాదు) బాండీలో కాగిన మంచినూనెలో వేసి దోరగా వేయించాలి. ఇవి రెండురోజులు మాత్రమే నిల్వ ఉంటాయి. ఈ చంద్రకాంతలను దీపావళి పిండివంటగా తయారుచేస్తారు.

శనగపిండి లడ్డూ

కావలసిన వస్తువులు:

శనగపిండి	:	ఒక కిలో
పంచదార	:	రెండు కిలోలు
పచ్చ కర్పూరం	:	కొంచెం
జీడిపప్పు	:	50 గ్రాములు
కిస్‌మిస్	:	50 గ్రాములు
నూనె	:	ఒకటిన్నర కిలో
ఏలకులు	:	పది
నెయ్యి	:	రెండు స్పూన్లు

తయారుచేసే విధానం:

శనగపిండి జల్లించుకోవాలి. బజ్జీల పిండిలాగ నీళ్ళు పోసి కలపాలి. బాండీలో నూనె పోసి బాగా కాగనివ్వాలి. బూందీ గరిటెతో పిండిని బూందీ దూసుకోవాలి. జీడిపప్పు, కిస్‌మిస్ నేతిలో వేయించుకోవాలి. యాలకుల పొడి చేసుకోవాలి. పంచదారలో నీళ్ళు పోసి పాకం పట్టాలి. తీగపాకం వచ్చాక పచ్చ కర్పూరం వేయాలి. బూందీ యాలకుల పొడి వేసి కలపాలి. పొయ్యి మీద నుంచి దింపి లడ్డూలు కట్టుకోవాలి. జీడిపప్పు, కిస్‌మిస్‌లనూ లడ్డూకు పైన అతికించాలి. ఇవి పది రోజులు నిల్వ ఉంటాయి.